News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :115 | ఖమ్మం | శుక్రవారం, జూన్ 5, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



## ప్రతిపక్షాల సమావేశానికి డీఎంకే దూరం

- 'ఇండి కూటమి'ని వీడుతోందా
- తమిళనాడులో కాంగ్రెస్, టీవీకే పొత్తుతో రగులుతున్న విభేదాలు
- తమ పార్టీ కార్యకర్తల మనోభావాలకు గౌరవం ఇచ్చి సమావేశానికి హాజరు కాబోమని ప్రకటించిన డీఎంకే
- లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీకి దూరంగా కూర్చోవడానికి అనుమతించిన సచివాలయం



## ఢిల్లీ అగ్నిప్రమాద భవనంలో అనేక లోపాలు

- ఎమర్జెన్సీ ఎగ్జిట్, వెంటిలేషన్ లేదట!
- మాలవీయా నగర్ అగ్నిప్రమాదంలో వెలుగుచూసిన కీలక విషయాలు
- ప్రమాద సమయంలో మూసి ఉన్న భవనం పైకప్పు



## మోదీ హయాంలో విద్యావ్యవస్థ నాశనం

- నీట్ విద్యార్థిని బలవన్మరణంపై రాహుల్ స్పందన
- పేపర్ లీక్ వివాదాల వల్ల విద్యార్థుల కలలు చెదిరిపోతున్నాయి
- నీట్ విద్యార్థిని మరణం కేవలం బలవన్మరణం కాదు
- అవినీతి, కుప్పకూలిన విద్యావ్యవస్థ చేసిన ఘోరం
- నీట్ విద్యార్థినీ మరణంపై తీవ్రంగా స్పందించిన రాహుల్‌గాంధీ

## కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా

# లక్ష ఎకరాలకు సాగునీరు

- పాలమూరు పర్యటనలో రేవంత్ రెడ్డి
- కాత్రేవుపల్లి ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన
- పాలమూరు ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మక్తల్ పర్యటన
- కాత్రేవుపల్లిలోని మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన
- సీఎంతో పాటు కర్ణాటక మాజీ మంత్రి బోసురాజు



హైదరాబాద్

మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. భీమా కృష్ణా నదులపై నిర్మించనున్న ప్రాజెక్టు పనుల పురోగతిపై గురువారం ముఖ్యమంత్రి బెంగుళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకోగా ఉత్తమ్ కుమార్ రెడ్డి దామోదర రాజనర్సింహ జూపల్లి కృష్ణారావు వాకిటి శ్రీహరి లకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఫోటో గ్యాలరీని ముఖ్యమంత్రి వీక్షించారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భీమా కృష్ణా నదులపై ప్రతిపాద బ్యారేజీ పనులు పురోగతికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్ ప్లాన్ మ్యాప్స్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించిన ఇరిగేషన్ అధికారులు పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతుల పరిశీలనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లాలోని నారాయణపేట-కొడంగల్, పాలమూరు-రంగారెడ్డితో వివరాలు 2లో..



## నేటి నుంచి భూముల ధరల పెంపు

- తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- భూముల ధరలు ఏరియాను బట్టి 50 నుంచి100 శాతం పెరుగుతాయి
- ప్రైమ్ ఏరియాలో 100 శాతం పెరుగుతాయి
- భూముల వ్యాల్యూ పెరగటంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం
- ఇక నుంచి సబ్ రిజిస్ట్రర్లకు ఫుల్ పవర్స్ కట్ చేశాం
- వారికి మినిమమ్ పవర్స్ మాత్రమే ఉంటాయి

## మరోసారి డీలిమిటేషన్ బిల్లు.. డీఎంకే, టీఎంసీ మద్దతు?

- వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును ప్రవేశ పెట్టేందుకు ప్రభుత్వం యోచిస్తోంది.
- దేశంలోని ప్రస్తుతం మారిన రాజకీయ పరిస్థితుల్లో బిల్లు పాస్ అయ్యేందుకు అవకాశాలు
- డీ లిమిటేషన్ పై తమ విధానంలో పునరాలోచన దిశగా డీఎంకే ఉన్నట్లు తెలుస్తోంది.
- జమిలి ఎన్నికల బిల్లును కూడా వీలైనంత త్వరగా ప్రవేశపెట్టి యోచనలో ప్రభుత్వం



## బీజేపీ రాజ్యసభ అభ్యర్థుల జాబితా విడుదల

- ఇటీవలే రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది
- జూన్ 18న పెద్దల సభకు ఎన్నికలు జరపనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది.
- దేశవ్యాప్తంగా 24 స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా ఏపీలో నాలుగు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.



# ఖజానా ఖాళీ



- ప్రతి నెలా దాదాపు రూ.18 వేల నుంచి 20 వేల కోట్ల ఖర్చు..
- తెలంగాణ సర్కార్‌కు ఆర్థిక కష్టాలు కొత్త తలనొప్పులు
- నిధుల లేమితో అభివృద్ధికి అడ్డంకులు
- ఆర్థిక పరిపుష్టికి ఇంకా సమయం పడుతుందని..అప్పటిదాకా కొత్తగా నిధులు ఇవ్వలేమంటూ ఏకంగా ఆర్థిక మంత్రే చేతులెత్తేయడం ఇప్పుడు హాట్ టాపిక్
- ఇలా అయితే ఇక ప్రజల్లోకి వెళ్లేది ఎలా అంటూ ఆందోళన చెందుతున్నారట అధికార పార్టీ ఎమ్మెల్యేలు
- తెలంగాణ సర్కార్ ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది
- లోటు బడ్జెట్‌తో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నట్లు కాగ్ స్పష్టం

హైదరాబాద్

కాంగ్రెస్ సర్కార్.. తెలంగాణ బండిని నడపలేక దిక్కులు చూస్తోందా? ఏం చేయాలో తోచక ప్రభుత్వ పెద్దలు తలలు పట్టుకుంటున్నారా? తెలంగాణ సర్కార్‌కు ఆర్థిక కష్టాలు కొత్త తలనొప్పులు తెస్తున్నాయా? నిధుల లేమితో అభివృద్ధికి అడ్డంకులు ఏర్పడుతున్నాయా? అంటే అవుననే టాక్ వినిపిస్తోంది. ఏకంగా ఆర్థిక శాఖ మంత్రే ఎమ్మెల్యేలతో ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆర్థిక పరిపుష్టికి ఇంకా సమయం పడుతుందని..అప్పటిదాకా కొత్తగా నిధులు ఇవ్వలేమంటూ ఏకంగా ఆర్థిక మంత్రే చేతులెత్తేయడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. ఇలా అయితే ఇక ప్రజల్లోకి వెళ్లేది ఎలా అంటూ ఆందోళన చెందుతున్నారట అధికార పార్టీ ఎమ్మెల్యేలు. వివరాలు 2లో..



## భారత్‌లో ముగ్గురు ఎబోలా వైరస్

- అనుమానితుల గుర్తింపు
- ఆరోగ్య శాఖ అప్రమత్తం
- కేంద్ర సంస్థల నుంచి అందిన హెచ్చరికల నేపథ్యంలో ఆరోగ్య శాఖ అప్రమత్తం
- ముందు జాగ్రత్త చర్యగా ఆ ముగ్గురు వ్యక్తులను గృహ నిర్బంధంలోనే
- కాంగో, ఉగాండా వంటి ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వేగంగా వ్యాపి
- ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం పౌరులకు కీలక అడ్వైజరీ జారీ

## వ్యవసాయ శాఖ ఆస్తుల రక్షణకు ఐఏఎస్‌లతో కమిటీ

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఎల్- నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై గ్రామసభల్లో రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలి
- అన్ని జిల్లాల్లో శాటిలైట్ ఆధారిత పంట వ్యర్థాల కాల్చివేతలపై పర్యవేక్షణ
- కొహెడ అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపనకు ఏర్పాట్లు వేగవంతం
- తెలంగాణ ఎరువుల పర్యవేక్షణ విధానం దేశానికి ఆదర్శం



హైదరాబాద్

వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులను ముందుగానే సన్నద్ధం చేయాలని ఉన్నతాధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఎల్- నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై గ్రామసభల్లో రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తక్కువ నీటితో పంటల సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు స్పష్టం . వివరాలు 2లో..

# ఖజానా ఖాళీ...

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణ సర్కార్ ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది. అవును. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఇచ్చిన రిపోర్ట్ ఇదే స్పష్టం చేస్తోంది. లోటు బడ్జెట్‌తో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నట్లు కాగ్ స్పష్టం చేసింది. హామీల అమలుకు ఆర్థిక స్థితి అడ్డంకిగా మారుతోంది. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇస్తే..వాటిని అమలు చేయడం ఇప్పుడు సర్కార్‌కు సవాల్‌గా మారింది. బడ్జెట్ అంచనాలకు..వాస్తవాలకు పొంతన లేని పరిస్థితి. ప్రతి నెల రాష్ట్ర ప్రభుత్వానికి 100 రూపాయలు ఆదాయం వస్తే దాదాపు 108 రూపాయలు ఖర్చు అవుతుంది. దీని కోసం ప్రతినెల అప్పులు చేయాల్సి వస్తోంది. దీంతో కేవలం రెండున్నర ఏళ్లలోనే 4.14 లక్షల కోట్ల అప్పులను తెచ్చింది సర్కార్. గతంలో ఉన్న అప్పులకు..అసలు, వడ్డీలు కట్టలేక నడ్డి విరుగుతుంటే..మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్లుగా కొత్తగా అవుతున్న లక్షల కోట్ల అప్పులు రేవంత్ ప్రభుత్వానికి గుదిబండగా మారాయి.అటు సంక్షేమాన్ని.. ఇటు అభివృద్ధిని పరుగులు పెట్టించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరాటపడుతుంటే..రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మాత్రం అగమ్యగోచరంగా మారుతోంది. దీంతో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు?కొత్త కొత్త పనులు, ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తూ సర్కార్ ముందుకెళ్తోంది. వాస్తవంగా ప్రతి నెల జీతాలు, పెన్షన్లు, అసలు, వడ్డీల చెల్లింపు, ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, ఇతర చెల్లింపులు అన్ని దాదాపు 18 వేల నుంచి 20 వేల కోట్ల వరకు ఖర్చవుతుంది. కానీ వాస్తవ రాబడి మాత్రం కేవలం 16 నుంచి 18 వేల కోట్లలోపే ఉంటుంది. అంటే దాదాపు ప్రతి నెల సగటున రూ.2,250 కోట్ల లోటు సర్కార్‌కు సవాల్ గా మారుతోంది. ప్రభుత్వం శక్తికి మించి కార్యక్రమాల అమలుకు, కొత్త అభివృద్ధి పనులను చేపట్టడం.. ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి నిచ్చెన వేసిందన్నట్లుగా తయారైంది పరిస్థితి.ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో వివిధ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై భట్టి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆరు నెలలకో, సంవత్సరానికో పరిస్థితి కుదుట పడుతుందని భట్టి తేల్చి చెప్పడంతో ఎమ్మెల్యేల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. ప్రభుత్వం ఎప్పుడు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతుందో? ఖజానా ఎప్పుడు కళకళలాడుతుందో? అప్పులు తీసుకునే అవసరం తగ్గుతుందో లేదో అనేది చూడాలి.

# కొండాపూర్ కిమ్స్ వైద్యులు ఘనత

## అరుదైన లాపరోస్కోపిక్ విప్పుల్ సర్జరీ సక్సెస్

గతంలో పాంక్రియాటిక్ శస్త్రచికిత్స జరిగిన వ్యక్తికే అరుదైన లాపరోస్కోపిక్ విప్పుల్ సర్జరీని కొండాపూర్? కిమ్స్ హాస్పిటల్స్ వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ సర్జరీకు సంబంధించిన వివరాలను శస్త్రచికిత్స చేసిన కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డా.సీ.హెచ్.నవీన్ కుమార్ తెలిపారు.


**మరో శస్త్రచికిత్స అవసరమైంది :** హైదరాబాద్ నగరానికి చెందిన ఓ 52 ఏళ్ల మహిళ గతంలో క్రానిక్ కాల్సిఫిక్ ప్యాంక్రియాటిటిస్‌కు ఓపెన్ శస్త్రచికిత్స చేయించుకున్నారని నవీన్? కుమార్ పేర్కొన్నారు. అదే రోగికి ఇప్పుడు లాపరోస్కోపిక్ విప్పుల్ సర్జరీ చేసి ప్రాణాలు కాపాడామని ఆయన వెల్లడించారు. రోగి అప్పటికే లేటరల్ ప్యాంక్రియాటికోజేజునోస్టమీ శస్త్రచికిత్స చేయించుకున్నారని చెప్పారు. అయితే ఆమె పచ్చకామెర్లు (జాండిస్), వాంతులతో ఆసుపత్రికి వచ్చినట్లు తెలిపారు. సమగ్ర వైద్య పరీక్షల అనంతరం, ప్యాంక్రియాస్‌లో మిగిలిన రాళ్లు (రిమ్నెంట్ ప్యాంక్రియాటిక్ స్టోన్స్) డ్యూడెనమ్‌లో అడ్డంకిగా (డ్యూడెనల్ అబ్స్ట్రక్షన్) ఉన్నట్లు వైద్యులు గుర్తించారని అన్నారు. దీనితో మరొక శస్త్రచికిత్స అవసరమైందని వివరించారు.

**ఆ సమస్యలు ఉండటంతో మరింత క్లిష్టం**

గతంలో నిర్వహించిన ఓపెన్ శస్త్రచికిత్స కారణంగా శరీర నిర్మాణంలో మార్పులు రావడం, అంటుకునే కణజాలం (అడ్హీజన్స్) ఏర్పడటం వంటి సమస్యలు ఉన్నాయని ఆయన తెలిపారు. దీంతో ఈ శస్త్రచికిత్స అత్యంత క్లిష్టంగా మారిందని వెల్లడించారు. అయినప్పటికీ మినిమల్లి ఇన్వేసివ్ విధానాన్ని ఎంచుకున్నామని అన్నారు. లాపరోస్కోపిక్ విప్పుల్ శస్త్రచికిత్స (ప్యాంక్రియాటోడ్యూడెనెక్టమీ)ను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు.

**కొత్త విధానంలో రీకన్స్ట్రక్షన్**

మునుపటి ప్యాంక్రియాటిక్ శస్త్రచికిత్సలు చేసిన రోగుల్లో తిరిగి లాపరోస్కోపిక్ విప్పుల్ శస్త్రచికిత్స చేయడం అత్యంత అరుదైన విషయమని ఆయన అన్నారు. శరీర నిర్మాణంలో మార్పులు, అంటుకునే కణజాలం, శస్త్రచికిత్స మార్గాల మార్పులు వంటి




కారణాల వల్ల ఇలాంటి శస్త్రచికిత్సలు చాలా సవాలుగా ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంలో, రోగి శరీర నిర్మాణానికి అనుగుణంగా గ్యాస్ట్రోఇంటెస్టినల్ కంటిన్యూయిటీని కొనసాగించేందుకు వైద్యులు ఒక కొత్త విధానంలో రీకన్స్ట్రక్షన్ చేపట్టారని వివరించారు. ఈ నూతన విధానమే శస్త్రచికిత్స విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించిందని వెల్లడించారు.

**తిరిగి ఆపరేషన్ చేయడం చాలా అరుదు**

గతంలో నిర్వహించిన ఓపెన్ ప్యాంక్రియాటిక్ శస్త్రచికిత్స తరువాత లాపరోస్కోపిక్ విధానంలో తిరిగి ఆపరేషన్ చేయడం చాలా అరుదైనదిగా అభివర్ణించారు. దీనికి ఖచ్చితమైన ప్రణాళిక, ఉన్నత స్థాయి నైపుణ్యం అవసరమని ఆయన అన్నారు. ఆపరేషన్ సమయంలో తక్షణ నిర్ణయాలు అవసరం అని తెలిపారు.

**ఈ శస్త్రచికిత్స విజయం అత్యంత అరుదు**

శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యంగా కోలుకొన్నారని డా.నవీన్ కుమార్ అన్నారు. వారం రోజుల్లోనే డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. ప్రస్తుతం ఆమె స్థితి స్థిరంగా ఉందని చెప్పారు. ఫాలోఅప్‌లో బాగానే ఉన్నట్లు వెల్లడించారు. మొదటగా శస్త్రచికిత్స చేసిన రోగిలో లాపరోస్కోపిక్ విప్పుల్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించిన ఈ ఘటన చాలా అరుదైనదిగా ఆయన పేర్కొన్నారు. ఇది మినిమల్లి ఇన్వేసివ్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ శస్త్రచికిత్సల్లో సాధించిన పురోగతిని ప్రతిబింబిస్తోందని వెల్లడించారు.

# భద్రాచలం మన్యానికి ముప్పు ఎంత?'

పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరీ తీర ప్రాంతమైన భద్రాచలం మన్యానికి ముప్పు పొంచి ఉంది. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించకున్నా పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఫుల్? రిజర్వాయర్ ట్యాంక్? లెవల్? (ఎఫ్?ఆర్?ఎల్) ఒకవేళ నీటి నిల్వ ద్వారా అవగతమవుతోంది. ప్రస్తుతం ఎఫ్?ఆర్?ఎల్? 135 అడుగులు (41.15 మీటర్లు) మేర ఉన్న సందర్భంలో వాటిల్లే నష్టాల గురించి సర్వే పనులు కొనసాగుతున్నాయి. ఒకవేళ (45.72 మీటర్లు) అంటే 150 అడుగుల వరకు ఎఫ్ఆర్?ఎల్? ఉంటే సంభవించే నష్టాల గురించి కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. అయితే ఈ విషయమై బీఆర్?ఎస్? నేత హరీశ్?రావు కూడా పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవోకు లేఖ రాశారు.

**కమిటీ ద్వారా పర్యవేక్షణ**

ప్రాజెక్టులో ఎఫ్?ఆర్?ఎల్ స్థాయి 150 అడుగులకు చేరిందంటే భద్రాచలం దగ్గర సాధారణ రోజుల్లో కూడా 43 అడుగుల వరకు వరద ప్రవాహం పారుతుంటుంది. అంటే ఈ ఎత్తులో నీరు ప్రవహిస్తున్నప్పుడు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ఇప్పుడు ఇదే సమస్య సర్వత్రా కలవర పరుస్తోంది. దీంతో ప్రత్యేకంగా ఓ కమిటీని నియమించి పోలవరం వరదను పర్యవేక్షించనున్నారు. ఈ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి, వరద గురించి సర్కారుకు నివేదికలు పంపనుంది.

**అప్పుడు వానొస్తే పరిస్థితేంటి?**

ప్రాజెక్టులో నీటి నిల్వ 150 అడుగుల మేర ఉన్నప్పుడు వానలు కురిస్తే అధిక ప్రాంతాలపై ముంపు ప్రభావం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ సందర్భంలో రామాలయం మెట్ల దాకా నీరు ప్రవహించే ప్రమాదముందని చెబుతున్నారు. రాబోయే ఏడాది వరకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసే దిశగా ఆంధ్రప్రదేశ్? సర్కారు ముందుకెళ్తోంది. అయితే, అనంతరం చోటుచేసుకునే పరిణామాలు ఎలా ఉండబోతున్నాయన్నదే అంతుపట్టడం



లేదు. భద్రాచలం, అశ్వాపురం, బూర్గంపాడు మండలాలతో పాటు పరిసర ప్రాంతాల్లోనూ అధికారులు పర్యటించారు. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నారు.

**బాధితులకు పరిహారం అందించాలి**

ఈ సమస్యను పరిష్కరించాలంటూ బీఆర్?ఎస్? నేత హరీశ్?రావు ప్రాజెక్ట్ అథారిటీ సీఈవోకు లేఖ రాశారు. పోలవరం పూర్తయితే భద్రాచలం పట్టణానికి నిత్యం జలగండమేనని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆటంకం గ్రామాలకే పరిమితం కాలేదనీ, పరిశ్రమలకూ బ్యాక్‌వాటర్ ముప్పు ఉందన్నారు. ముంపు బాధితులకు పరిహారం అందించి పునరావాసం కల్పించాలన్నారు. భద్రాచలం వద్ద తక్షణమే కరకట్టల నిర్మాణం చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. భద్రాచలంలోనే పోలవరం అథారిటీ ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలని కూడా ఆయన సూచించారు. ప్రస్తుతం భద్రాచలంలో పర్యటిస్తున్న పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ బృందం అధికారులకు పినపాక, భద్రాచలం బీఆర్ఎస్ నాయకులు ఆ లేఖను అందజేశారు.

**ఓట్లు తొలిగే అవకాశం**

2014లో రాష్ట్రాల విభజన సమయంలో ముంపు పేరిట పూర్తిగా ఐదు మండలాలు పాక్షికంగా రెండు మండలాలను ఏపీలో విలీనం చేయడంతో ఈ ప్రాంత స్వరూపం భౌగోళికంగా మారిపోయింది. భద్రాచలం శివారు పరిధికి సంబంధించిన రాజుపేటకాలనీ, శ్రీరాం నగర్? కాలనీలో కొంత భాగం పోలవరం జిల్లాలోని ఎటపాక మండలంలో కలిసిపోయాయి. అయితే ఈ ప్రాంతంలో ఉండే జనాభాలో కొందరికి రెండు రాష్ట్రాల్లో ఓటర్లుగా నమోదయ్యారు. ఓటర్ల ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో వందల సంఖ్యలో ఓటర్లు భద్రాచలం జాబితా నుంచి వైదొలిగే వీలుంది.

**70 వేల కుటుంబాలు ఏపీకి**

భద్రాచలం నియోజకవర్గానికి చెందిన కూనవరం, చింతూరు, వరరామచంద్రాపురం, ఎటపాక (భద్రాచలం రూరల్?) మండలాలు ప్రస్తుతం పోలవరం జిల్లాలో విలీనమయ్యాయి. వేలేరుపాడు, కుక్కునూరు మండలాలు సైతం పోలవరం నియోజకవర్గంలో కలిసిపోయాయి. వీటితో పాటు బూర్గంపాడు మండలంలోని పలు గ్రామాలు చేరిపోయాయి. దీంతో పోలవరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించిన 70 వేల కుటుంబాలు ఆంధ్రప్రదేశ్?లో కలిసిపోయాయి.

**ప్రత్యామ్నాయంగా వీటిని చేపడితే**

పోలవరం ప్రాజెక్టు ద్వారా సంభవించే ముప్పును నివారించేందుకు చర్యలు చేపట్టాలి.

భద్రాచలం నుంచి పినపాక నియోజకవర్గాల మధ్య ఉన్న గోదావరి వరద తట్టుకునేందుకుగానూ కరకట్టలు కట్టాలి. ఇప్పటికే ఉన్న వాటి ఎత్తును పెంచాలి.

వర్షాకాలంలో స్లూయూస్?ల దగ్గర వరద నీరు ప్రవహించదు. ఈ సమయంలో మోటార్ల ద్వారా నీటిని తోడేయాలి.

లోతట్టు ప్రాంత ప్రజలను మెరకకు తరలించి వారికి కాలనీలు నిర్మించాలి.

ఎక్కువగా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

రహదారులపై ప్రవహించే వాగులపైన చప్టాలు నిర్మించాలి. వంతెనలు ఏర్పాటు చేయాలి. అవసరమైన చోట రోడ్ల ఎత్తును పెంచాలి.

## కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు

-మొదటిపేజీ తరువాయి

పాటు పెండింగ్ ప్రాజెక్టుల పనులను క్షేత్రస్థాయిలో పరిశీస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులపై అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. రేపు పీఆర్ఎల్ఐ ప్రాజెక్టులోని ప్యాకేజీలను పరిశీలించుకుంటూ వచ్చిన అనంతరం జడ్చర్లలో భారీ బహిరంగ సభలో పాల్గొనున్నారు.

**బ్యారేజీలపై ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీ**

ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో సందర్శించి పనుల పురోగతిని పరిశీలించేందుకు సీఎం రేవంత్ పాలమూరు జిల్లాలో పర్యటిస్తున్నారు. ఇవాళ, రేపు మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లు, పంప్ హౌస్‌లను పరిశీలిస్తున్నారు. మధ్యాహ్నం నారాయణ పేట జిల్లా మక్తల్ కు హెలికాప్టర్ ద్వారా చేరుకున్న సీఎం కొడంగల్ - నారాయణపేట ప్రాజెక్టుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కోయిల్ సాగర్ ప్రాజెక్టు, కృష్ణా, భీమా నదులపై ప్రతిపాదిత బ్రిడ్జి కమ్ బ్యారేజీలు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. పాలమూరు ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా ముఖ్యమంత్రి, మంత్రులు కాట్రావుపల్లిలో ఎత్తిపోతల పథకం, ప్రతిపాదిత బ్యారేజీలపై ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీ వీక్షించారు. సీఎంతో పాటు కర్ణాటక మాజీ మంత్రి బోసురాజు కూడా మక్తల్ చేరుకున్నారు. సాయంత్రం జోగులాంబ గద్వాల జిల్లాకు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధరూర్ మండలం గుడ్డందొడ్డి హెలిప్యాడ్ చేరుకున్నారు. గుడ్డందొడ్డి రిజర్వాయర్, జవహర్ లాల్ నెహ్రూ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఫేజ్-1 ను పరిశీలించారు. గుడ్డందొడ్డి రిజర్వాయర్ ప్రస్తుత సామర్థ్యం 1.5 టీఎంసీలు కాగా 15 టీఎంసీలకు పెంచాలని ప్రతిపాదన సాధ్యాసాధ్యాలపై పరిశీలించారు. నెట్టెంపాడు ఫేజ్-1 పంప్ హౌస్ పరిశీలన, ఫొటో ఎగ్జిబిషన్ వీక్షించారు. పాలమూరు ప్రాజెక్టుల పరిస్థితి, నీటి నిల్వ సామర్థ్యంపై వీడియో ప్రదర్శించారు.

**సోమశిలలోనే సీఎం బస**

ఆ తర్వాత హెలికాప్టర్ ద్వారా బయలుదేరి సాయంత్రం 6 గంటలకు నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిలకు చేరుకున్నారు. అక్కడి మృగవాణి రిసార్ట్ రివర్ ఫ్రంట్ లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కొల్లాపూర్‌లోని సోమశిలలోనే సీఎం బస చేయనున్నారు.

**రేపటి పర్యటన వివరాలు**

రేపు కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు పంప్ హౌస్‌కు సీఎం చేరుకుంటారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ-3 హెడ్ రెగ్యులేటర్ ప్యాకేజీ-2 నార్లాపూర్ రిజర్వాయర్ ప్యాకేజీ-1 డెలివరీ సిస్టర్న్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం లిఫ్ట్-1 పంప్ హౌస్?లను పరిశీలిస్తారు. నాగర్ కర్నూల్ జిల్లా వట్టెం రిజర్వాయర్ పరిశీలన అనంతరం మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని కొత్తూరు హెలిప్యాడ్ కు చేరుకుంటారు. అనంతరం పీఆర్ఎల్?ఐలోని కరివెన రిజర్వాయర్ ప్యాకేజీ-14, 15 పనులను పరిశీలిస్తారు. జడ్చర్ల మండలం ఉద్దండాపూర్ హెలిప్యాడ్ కు చేరుకుంటారు. అక్కడ ప్యాకేజీ 17, 18 పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుంటారు. అనంతరం జడ్చర్లలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.

## వ్యవసాయ శాఖ ఆస్తుల రక్షణకు ఐఏఎస్‌లతో కమిటీ

-మొదటిపేజీ తరువాయి

చేశారు. పంట వ్యర్థాలను కాల్చడంపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకోసం అన్ని జిల్లాల్లో శాటిలైట్ ఆధారిత పంట వ్యర్థాల కాల్చివేతలపై పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు.

కొహెడ అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపనకు ఏర్పాట్లు వేగవంతం చేసినట్లు చెప్పారు. రూ. 2,284.32 కోట్లతో కొహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. జూన్ 6వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఇక వ్యవసాయశాఖకు చెందిన ఖాళీ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామన్నారు. ఈ ఆస్తుల రక్షణ కోసం ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఖాళీ స్థలాల్లో ప్లాంటేషన్ లేదా లీజు ద్వారా ఆదాయం సమీకరణ చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు.

తెలంగాణ ప్రభుత్వానికి చెందిన ఫెర్టిలైజర్ యాప్‌కు కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రశంసలు కురిపించిందని చెప్పారు. తెలంగాణ ఎరువుల పర్యవేక్షణ విధానం దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కేంద్ర ఫెర్టిలైజర్ యాప్ అమలుకు తెలంగాణను పైలట్ రాష్ట్రంగా ఎంపిక చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. యాప్ సమర్థ అమలుకు రాష్ట్రానికి ప్రోత్సాహకాలు అందిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. జూన్ 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. రైతులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది సేవలు అందించాలని వారికి మంత్రి పొంగులేటి సూచించారు.

## నేటి నుంచి భూముల ధరల పెంపు

**హైదరాబాద్** మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు శుక్రవారం నుంచి పెరుగుతాయని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భూముల ధరలు ఏరియాను బట్టి 50 నుంచి100 శాతం పెరుగుతాయని తెలిపారు. ప్రైమ్ ఏరియాలో 100 శాతం పెరుగుతాయన్నారు.



గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. భూముల వ్యాల్యూ పెరగటంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం వస్తుందని చెప్పారు. హయ్యర్ సైడ్ ఏరియాలు శేరిలింగంపల్లి, రాజేందర్ నగర్, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగవన్నారు. ఆయా ప్రాంతాల్లో ఛార్జీలు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని తెలిపారు. ఇక నుంచి సబ్ రిజిస్టర్లకు ఫుల్ పవర్స్ కట్ చేశామని.. వారికి మినిమమ్ పవర్స్ మాత్రమే ఉంటాయని మంత్రి పొంగులేటి వివరించారు. భూ సేకరణ సమయంలో ప్రభుత్వానికి కొంత నష్టం జరిగిందన్నారు. కానీ రైతులకు మాత్రం లాభం జరుగుతుందన్నారు. ఇన్నర్ సైడ్ ఎకరం కనీసం రూ.15 లక్షలు ఉందని చెప్పారు. లోయర్ సైడ్ ఏమైనా పొరపాటు జరిగితే మార్పులు చేర్పులు ఉంటాయని చెప్పారు. హయ్యర్ సైడ్ మాత్రం మార్పులు ఉండవన్నారు. సమస్యలు ఉంటే.. హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేస్తామని పబ్లిక్‌కు ఆయన సూచించారు. త్వరలో తహసీల్దార్ల బదిలీలు ఉంటాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేసి అవకాశమే లేదని స్పష్టం చేశారు. రెవెన్యూ విషయంలో.. తెలంగాణను మిగతా రాష్ట్రాలు మోడల్‌గా తీసుకుంటున్నాయని గుర్తు చేశారు. ఏడాదిన్నరలో 90 శాతం గ్రామాల సర్వే పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూలో అవినీతి లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ట్రాప్‌లు అధికంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. తాను వచ్చాక ఏసీబీ ట్రాప్ అయిన ఫైల్స్ అన్ని క్లియర్ చేశానని తెలిపారు. గత ప్రభుత్వంలో మూడేళ్లు రెవెన్యూ ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. కానీ తాను వచ్చిన మూడు నెలల్లోనే 3,500 రెవెన్యూ ఫైల్స్ క్లియర్ చేశానని వివరించారు. అసెంబ్లీలో పెండింగ్‌లో ఉన్న 10 ఏళ్ల ఫైల్స్ ఆరు నెలల్లోనే క్లియర్ చేసినట్లు చెప్పారు. తనకు ఏ శాఖ కేటాయించినా.. కళ్లు మూసుకొని పని చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మంచి జరిగే ఏ పని చేయడానికైనా తాను భయపడనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుండబద్దలు కొట్టారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇండ్లకు రూ. 7 వేల కోట్లు చెలించామని చెప్పారు. రాష్ట్రంలో పాడి ప్రోక్యూర్‌మెంట్ 90 శాతం పూర్తయిందన్నారు. అసైన్డ్ భూములకు పాలసీ తీసుక వస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగినవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితా (ప్రొహిబిటెడ్ లిస్ట్)లో చేర్చిందని మంత్రి పొంగులేటి వివరించారు.

## భద్రాచలంలో గంజాయి విక్రేతలు అరెస్ట్...




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 04,** భద్రాచలం గోదావరి కరకట్ట, రెడ్డి సత్రం సమీప ప్రాంతంలో నిర్వహించిన పెట్రోలింగ్‌లో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను భద్రాచలం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

డీఎస్పీ అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐ పి. శ్యాం ప్రసాద్ సిబ్బందితో కలిసి నిర్వహించిన తనిఖీల్లో వాడపర్తి సురేష్, షేక్ షఫీర్ పాషా ( సప్పు) అనే ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా విచారించారు. వారి వద్ద నుంచి సుమారు ఒక కిలో గంజాయి, ఒక మోటార్ సైకిల్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.45 వేలుగా పోలీసులు తెలిపారు. గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తూ లాభాలు పొందుతున్నట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లి దండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలని డీఎస్పీ సూచించారు.

గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయం, రవాణా, నిల్వపై సమాచారం ఉన్నవారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీసులు పేర్కొన్నారు.

## విద్యతోనే మనకు బంగారు భవిష్యత్తు

- పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశం మేరకు
- గో టూ విలేజ్ కార్యక్రమం



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండలం అనంతసాగర్ గ్రామంలో గో టు విలేజ్ అనే కార్యక్రమాన్ని మండల ప్రధాన కార్యదర్శి వేర్పుల హరికృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమాన్ని కి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాని మండల ఇంచార్జ్ పగిడిపల్లి రవీంద్ర మాదిగగారు ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ యొక్క కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడటం జరిగింది

విద్యార్థిని విద్యార్థులకు మీ యొక్క చదువుతో జాతి భవిష్యత్తుని మన పిల్లల భవిష్యత్తుని మార్చగలిగే శక్తి చదువుకు మాత్రమే ఉందని చదువుతోనే ప్రతి ఒక్కటి సాధ్యపడుతుందని చదువుతోపాటు రాజకీయ చైతన్యం చెందాలని రాజ్యాధికారం మన వైపు తిప్పుకోవాలని అలాగే ఎస్సీ వర్గీకరణ సాధించుకొని వాటి ఫలాలను మనము అందిపుచ్చుకోవాలని తెలియజేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిర్రా ఉపేంద్ర మాదిగ అనంత సాగర్ గ్రామ పెద్దలు మహిళలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది

## ప్రత్యామ్నాయ పంటలపై రైతులుపునరాలోచించాలి

- మండలఏపీఓ రాతికింది సురేష్
- సర్పంచ్ : బాణోతు అరుణ రమేష్ నాయక్




**గరిడేపల్లి సికే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** రానున్న ఖరీఫ్ పంటకు రైతులు వరి పంట కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై పునరాలోచించాలని గరిడేపల్లి ఏపీఓ రాతికింది సురేష్ అన్నారు. గురువారం గారకుంటతండ గ్రామంలో 99 రోజుల ప్రజా పాలనా – ప్రగతి ప్రణాళిక ముగింపు గ్రామ సభను సర్పంచ్ బాణోతు అరుణ రమేష్ నాయక్ అధ్యక్షతాన నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ పంటలు పామయిల్, నిమ్మ, బత్తాయి, తదితర పంటలకు ఉపాధి హామీ పథకం కింద మొక్కలు అందజేసి వాటి సంరక్షణకు ప్రభుత్వం రాయితీ మంజూరు చేస్తుందన్నారు. అలాగే విద్యుత్ సమస్యలపై ఏఈ భూక్య వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరా విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైన స్థానిక లైన్ మెన్ దృష్టికి తీసుకోచ్చి పరిష్కారం చేసుకోవాలన్నారు. అలాగే వ్యవసాయ చాజుూ సంధ్య మాట్లాడుతూ.. వరి కొయ్యలను కాల్చకూడదని, కాలిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పంచాయతీ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ నూతన ఫించన్ కొరకు దరఖాస్తులు చేసుకోవాలని, 57 సంవత్సరాలు కలిగి ఉన్న వారు అర్హులని తెలిపారు. పింఛన్ కొరకు ఓటర్ ఐడీ ప్రామాణికంగా తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గౌతమి, గరిడేపల్లి మాజీ సర్పంచ్ సైదానాయక్, లైన్ మెన్ శ్రీనివాస్, వార్డు సభ్యులు సైదానాయక్, సక్కి, బూలీ, ఝాన్సీ, జయరాం, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా పాలన. -- ప్రగతి ప్రణాళిక ప్రధాన లక్ష్యం

- జిల్లా కలెక్టర్ అంకిత్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 04,** ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ సభకు జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మార్చి 6వ తేదీ నుండి అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలు చేయబడుతోందని తెలిపారు.

గ్రామ సభలు ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను చేరవేసే సమర్థవంతమైన వేదికలని అన్నారు. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని అన్నారు .

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంట మార్పిడి విధానాలను అనుసరించాలని, వ్యవసాయ శాఖ సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. ఎరువులు, పురుగుమందుల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పంటల దిగుబడులు పెరిగేలా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు.

గ్రామాల్లో సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే అలవాటు ప్రతి కుటుంబం అలవరుచుకోవాలని కోరారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు.

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను జాబితా నుండి తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు.

బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, రైతులు, గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, గ్రామంలోని విద్యుత్ అదనపు లైన్లు , అంతర్గత రహదారుల నిర్మాణం, తాగునీటి కి ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను వెంటనే చర్యలు చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామారావు, డి ఆర్ డి ఓ విద్యా చందన, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో మరో ఘనత సాధించిన ఐటిడీఏ భద్రాచలం పీవో రాహుల్...




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,జూన్ 04,** ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన జాతీయ పి ఓ కాన్ఫరెన్స్‌లో ఐటిడీఏ భద్రాచలం ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ దేశంలోని ఉత్తమ ప్రాజెక్ట్ అధికారిగా ఎంపికై ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు.

నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ అశోక్ కుమార్, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి రంజనా చోప్రా చేతుల మీదుగా పీవో రాహుల్, ఏపీవో డేవిడ్ రాజ్‌లకు రూ.5 లక్షల ప్రోత్సాహక పురస్కారం అందజేశారు. గిరిజన మ్యూజియం, భద్రగిరి మార్ట్, ఉద్దీపకం, కెరీర్ గైడెన్స్, ఇలవేల్పుల చరిత్ర పరిరక్షణ, క్రీడల ప్రోత్సాహం వంటి కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ పథకాల సమర్థ అమలుకు ఈ గుర్తింపు లభించింది. ఇప్పటికే గవర్నర్ చేతుల మీదుగా 'బెస్ట్ ఎలెక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు', ముఖ్యమంత్రి చేతుల మీదుగా 'బెస్ట్ రూరల్ టూరిజం అవార్డు', ఆదివాసీ ఐక్య వేదిక నుంచి 'ఆదివాసీ వికాస రత్న' బిరుదు అందుకున్న రాహుల్, ఇప్పుడు జాతీయ స్థాయిలో మరో ప్రతిష్టాత్మక అవార్డు అందుకోవడం విశేషంగా నిలిచింది.

ఐటిడీఏ అధికారులు, గిరిజన ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు పీవో రాహుల్‌కు అభినందనలు తెలిపారు.

## గుర్రం వెంకటరెడ్డి మృతి గ్రామానికి తీరని లోటు

సర్వారం సింగిల్ విండో మాజీ చైర్మన్ వీరం రెడ్డి శశీబిరెడ్డి



**గరిడేపల్లి సికే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** మండల పరిధిలో ఉన్న గానుగుబండ గ్రామానికి చెందిన గుర్రం వెంకటరెడ్డి మృతి గ్రామానికి తీరని లోటు అని సర్వారం సింగిల్ విండో మాజీ చైర్మన్ వీరం రెడ్డి శశీబిరెడ్డి అన్నారు ఈరోజు గ్రామంలో వారి ప్రార్థివ దేహం పై పూలమాలవేసి నివాళులర్పించారు గుర్రం వెంకటరెడ్డి గానుగబండ గ్రామానికి అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేశారని వ్యక్తిగతంగా గ్రామంలో చాలా మంచి పేరు తెచ్చుకున్నారని వారి హఠాత్తు మరణం గ్రామానికి తీరని బాధ కలిగించిందని వారు అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పెండెం వీరయ్య గౌడ్ మాజీ వార్డు మెంబర్ మండేలు వెంకట్ రెడ్డి పెద్దలు వెంకట్ రెడ్డి గ్రామస్తులుతదితరులు పాల్గొన్నారు

## నూతన కార్యదర్శికి హెచ్ యన్ ఎస్ బ్రదర్స్ సన్మానం

హెచ్ యన్ ఎస్ బ్రదర్స్ ఫౌండర్ నీలా హేమ్లా నాయక్




**గరిడేపల్లి సికే న్యూస్ ప్రతి నిది సందీప్ నాయక్ గుగులోతు** మండల పరిధిలో ఉన్న గార కుంట తండా గ్రామపంచాయతీ కార్యాలయానికి ఇటీవల బదిలీలో భాగంగా మఠంపల్లి మండలం నుంచి గార కుంట తండా గ్రామానికి నూతన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ధీరావత్ నాగరాజు నాయక్ కు హెచ్ యన్ ఎస్ బ్రదర్స్ ఫౌండర్ గుగులోతు నీలా హేమ్లా నాయక్ సభ్యులు గ్రామ సామాజిక సేవాకర్త గుగులోతు నరేందర్ నాయక్ ఆధ్వర్యంలో నూతన కార్యదర్శికి ప్రత్యేకంగా సన్మానించి గ్రామంలో పలు సమస్యలు వివరించి వినతి పత్రం అందజేయడం జరిగింది గార కుశీట తండ గ్రామంలో పలు వీధులలో ఉన్న సమస్యలను మరియు మాజీ ఎంపిటిసి వెంకట్రామ్ నాయక్ ఇంటి ముందు నూతన బోరును ఏర్పాటు చేయాలని అదేవిధంగా నాలుగో వార్డులో నూతన బోరు ఏర్పాటు చేయాలని గ్రామ ఎంట్రెన్స్ లో ఉన్న రెండు స్తంభాలకు వీధిలైట్లు అన్ని స్తంభాలకు లైట్లుఏర్పాటు చేయాలని మురుగు కాలువలు శుభ్రం చేయాలని ప్రతిరోజు ఇంటింటికి చెత్త బండి తిరిగి ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలని మరియు ఉపాధి హామీలో ప్రతి పేదవారికి పని కల్పించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో మండల ఏపీఓ రాతికింది సురేష్ గ్రామ పెద్దలు పులియ నాయక్ వార్డు మెంబర్ సైదా నాయక్ యువకులు నాగు నాయక్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## 14వ, వార్డులో అదే తీరు,



**జూన్ 04 (సీ కే న్యూస్ చేగుంట)** చేగుంట పట్టణ కేంద్రంలోని ఎన్జీవోస్ కాలనీ 14వ వార్డు గల్లీ పరిస్థితి దయనీయంగా మారింది. వర్షాకాలం ప్రారంభంలోనే ఇక్కడి వీధులు మురుగుకూపాన్ని తలపిస్తున్నాయి. కొద్దిపాటి వర్షానికే డ్రైనేజీలు పూర్తిగా నిండిపోయి, మోరీల్లోని మురికినీరు, బురద మొత్తం రోడ్డుపైకి చేరడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై నిలిచిన మురుగునీరు, పేరుకుపోయిన చెత్తాచెదారం వల్ల స్థానికులు, వాహనదారులు కనీసం నడవలేని పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ బురద నీటిలోనే ప్రయాణించాల్సి వస్తోందని, మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాపించి రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కూసుమంచి డీసీసీబీ ని ఆకస్మిక తనిఖీ సీఈఓ ఎన్వీ ఆదిత్య



- డిపాజిట్ల పెంపుపై ప్రత్యేక దృష్టి
- గోల్డ్ లోన్ల ప్రచారానికి ఉద్యోగులకు సూచనలు
- కల్లూరుగూడెం సొసైటీ పనితీరుపై సమీక్ష
- రైతులకు మరింత మెరుగైన సేవలందించాలని ఆదేశించారు.

**సి కె న్యూస్ కూసుమంచి:** కూసుమంచి మండల కేంద్రంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డీసీసీబీ శాఖను బ్యాంకు సీఈఓ ఆదిత్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు వ్యాపారాభివృద్ధి, డిపాజిట్ల సేకరణ, రుణాల మంజూరు, ఖాతాదారులకు అందిస్తున్న సేవలు, నగదు లావాదేవీల వివరాలను సమీక్షించారు. అనంతరం బ్యాంకు అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో సీఈఓ ఆదిత్య మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధికి డిపాజిట్లే ప్రధాన బలమని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి డిపాజిట్ల సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామీణ ప్రాంత ప్రజలను బ్యాంకింగ్ సేవల వైపు ఆకర్షించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న బంగారం ఆభరణాల రుణాలు గోల్డ్ లోన్స్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ఈ సేవలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. అత్యవసర ఆర్థిక అవసరాల కోసం ఖాతాదారులు గోల్డ్ లోన్లను సద్వినియోగం చేసుకునేలా బ్యాంకు సిబ్బంది చొరవ తీసుకోవాలని ఆదేశించారు. అలాగే డిజిటల్ బ్యాంకింగ్ సేవల వినియోగాన్ని పెంచి ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం సీఈఓ కల్లూరుగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ)ని సందర్శించి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ సూపర్వైజర్ కొంగర వేణు, సొసైటీ ఇన్‌చార్జి శేఖర్ తో సమావేశమై సొసైటీ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. రైతులకు అందిస్తున్న పంట రుణాలు, ఎరువులు, విత్తనాల సరఫరా, రుణాల రికవరీ, సభ్యుల నమోదు, డిపాజిట్ల సేకరణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సహకార సంఘాలు గ్రామీణ రైతాంగానికి వెన్నెముకలాంటివని, రైతులకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. రుణాల పంపిణీలో పారదర్శకత పాటించడంతో పాటు రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సొసైటీ వ్యాపారాభివృద్ధి, సభ్యుల సంఖ్య పెంపు, ఆర్థిక లావాదేవీల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

సహకార వ్యవస్థ బలోపేతానికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సీఈఓ పేర్కొన్నారు. ఈ తనిఖీలో బ్యాంకు అధికారులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడే వలిగొండలో డెల్టా స్కూల్ ప్రారంభం.

- ప్రారంభించనున్న ఎమ్మెల్యే కుంభం.

**సి కె న్యూస్ వలిగొండ మండలం, ప్రతినిధి బాలరాజు జూన్ 4.** వలిగొండ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన డెల్టా స్కూల్ భవనాన్ని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శుక్రవారం ఉదయం 11 గంటలకు లాంఛనంగా ప్రారంభించనున్నారు 1500 చదరపు గజాల విస్తీర్ణంలో 20 తరగతి గదులను అత్యాధునికంగా నిర్మించారు మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ క్లాస్ లను నిర్వహించేందుకు పాఠశాల యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసింది డిజిటల్ క్లాసులను ఏసీ గదులలో సీసీ కెమెరాలు పర్యవేక్షణలో విద్యను అందించేందుకు డెల్టా హై స్కూల్ తగుఏర్పాట్లను చేసుకుంది వలిగొండ నుండి భువనగిరి వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కన సబ్ స్టేషన్ సమీపంలో సువిశాలమైన మైదానంలో ఈ పాఠశాలను నిర్మించారు 15 సంవత్సరాల నుండి ఈ పాఠశాలను నడుపుతున్నారు ఆది అనుభవంతో అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించి పాఠశాలను నడుపుతూ ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలను సాధిస్తూ వస్తున్నారు. ఇంకా అనేకమంది విద్యార్థులు ఈ పాఠశాల నుండి డాక్టర్లు ఇంజనీర్లుగా ఎదిగారు ఆదే స్ఫూర్తితో విద్యార్థులను తీర్చిదిద్దాలన సంకల్పంతో కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు అన్ని సౌకర్యాలతో కూడిన నూతన పాఠశాల




భవనాన్ని నిర్మించారు విద్యార్థులకు రక్షణగా పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నలువైపులా సీసీ కెమెరాలను అమర్చారు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించే ఈ పాఠశాల భవన కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు మండల ప్రజలు పాల్గొని ఆశీస్సులు అందించాలని పాఠశాల కరస్పాండెంట్ పబ్బు శ్రీధర్ ప్రిన్సిపాల్ వెంకటేష్ కోరారు.

## చెట్టును ఢీకొట్టిన కారు.. తృటిలో తప్పిన పెను ప్రమాదం..



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూన్ 04,** పినపాక మండలం ఏడూళ్లబయ్యారం--రంగాపురం ప్రధాన రహదారిపై గోపాలరావుపేట సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళు_న్న కారు ఒక్కసారిగా అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదం లో కారులో ప్రయాణిస్తున్న దంపతులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వీరు కరకగూడెం మండలానికి చెందిన విద్యుత్ శాఖ లైన్మన్ దంపతులుగా తెలిసింది. ప్రమాదం జరిగిన ప్రదేశంలో చెట్టు పక్కనే విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఉండటంతో కారు దానిని ఢీకొట్టకుండా ఉండటంతో పెను ప్రమాదం తృటిలో తప్పిందని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి గాయపడిన వారిని బయటకు తీసి చికిత్స కోసం పంపించారు. ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## చేగుంట నూతన తహసిల్దార్ బాలలక్ష్మిని సత్కరించిన మండల రిపోర్టర్లు



**జూన్ 04 సీ కే న్యూస్ చేగుంట** చేగుంట మండల్ నూతన తహసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన, బాలలక్ష్మిని చేగుంట మండల రిపోర్టర్లు (పాత్రికేయులు) గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు,

ఈతహసిల్దార్ బాలలక్ష్మి దీనికంటే ముందు వెల్దుర్తి మండలంలో ఎమ్మార్వోగా సుదీర్ఘ సేవలు అందించి, బదిలీపై చేగుంట మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేగుంట మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకమైన సేవలు అందిస్తానని స్పష్టం చేశారు. మండల ప్రగతిలో మీడియా పాత్ర కూడా కీలకమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు సహకరించాలని కోరారు.

?ఈ కార్యక్రమంలో చేగుంట మండల రిపోర్టర్లు అన్నం మహేష్, సూర్య ప్రకాష్, మొహమ్మద్ ముజామిల్, సతీష్, నాగార్జున, శ్రావణ్ కుమార్, చిక్కుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.


## పంచాయితీ సమస్యలపై ఎమ్మెల్యే కి వినతిపత్రం సమర్పించిన సర్పంచ్ తుర్రం శ్రీను...

- క్యాంపు కార్యాలయంలో " జారే "ను కలిసిన సర్పంచ్...

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూన్ 04,** పంచాయితీ అభివృద్ధి కోసం తపనతో గురువారం గండుగులపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జారే తో పలుసమస్యలపై మాట్లాడి వినతిపత్రం ఇవ్వడం ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ప్రజాభివృద్ధి కి ఎల్లప్పుడూ తోడ్పాటు ఉంటుందని అన్నారు.

**వినతిపత్రం సమస్యలు**

1. ఇందిరమ్మ ఇల్లు అదనంగా మంజూరి చేయాలని (గతం లో డబుల్ బెడ్రూమ్ రాలేదు)
2. పుట్టతోగు మరియు తుమ్మలకుంట గ్రామాలకు అంగన్వాడి బిల్డింగులు మంజూరు
3. తిమ్మంపేట కాలనీకి సైడ్ కాలువ మంజూరు కొరకు
4. రాజీవ్ నగర్ కాలనీలో ఆర్ అండ్ బి రోడ్డు పక్కకు సైడ్ కాలువ మంజూరి కొరకు
5. పుట్టతోగు తిమ్మంపేట కాలనీ, అనందపురం గ్రామాలకు సెంట్రల్ లైటింగ్ మంజూరి కొరకు
6. అనందపురం స్కూలుకి ప్రహరీ మంజూరు కొరకు
7. తిమ్మంపేట హెల్త్ సెంటర్ కి ప్రహరీ మరియు వాటర్



మరియు కరెంట్ లైన్ మంజూరి కొరకు
8. అన్ని గ్రామాలకు కల్వర్టుల మంజూరు కొరకు
9. అన్ని గ్రామాలకు సిసి రోడ్ల మంజూరి కొరకు
10. గ్రామపంచాయతీ ఆఫీస్ లో బోరు, మోటార్ మంజూరు కొరకు వినతిపత్రం సమర్పించారు..

ఈ కార్యక్రమం లో సర్పంచ్ తుర్రం శ్రీను, పంచాయితీ నాయకులు పాల్గొన్నారు

## మత్స్య పారిశ్రామిక సంఘం ఎన్నికల్లో డైరెక్టర్లుగా ఎన్నిక.





**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 4.** వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో గల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు గురువారం నిర్వహించగా సంఘం డైరెక్టర్లుగా దుడ్డ అండాలు, చెవ్వ ఎల్లమ్మ, దుడ్డ ఆంజనేయులు, మారబోయిన అంజయ్య, సూరబోయిన దయాకర్, నిమ్మల శేఖర్, మారబోయిన పరుశురాం, బత్తెపు శేఖర్, బోల్లబోయిన శేఖర్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కుర్ర సురేష్ వ్యవహరించారు. అనంతరం గెలుపొందిన సభ్యులు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజు మహాసభ గ్రామ శాఖ అధ్యక్షుడు గుర్రాల రాములు, భత్తెపు రంగనాధ్, మారబోయిన మత్స్యగిరి, చెవ్వ రాజు ముదిరాజ్, బత్తెపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## జనగణన జాబితా వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా ఉండాలి.

**జిల్లా కలెక్టర్ అంకిత్.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,జూన్ 04,** జనగణన-2027 ప్రక్రియలో రూపొందించే జాబితా ప్రజల వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సూపర్వైజర్లతో గురువారం ఐడిఓసి కార్యాలయం లోని కలెక్టర్ ఛాంబర్లో జనగణన నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు కీలకమైన ప్రక్రియ అని అన్నారు. క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ సమయంలో ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని సూచించారు. జనగణన జాబితాలో నమోదు చేసే సమాచారం వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా, ఖచ్చితంగా ఉండేలా ఎన్యూమరేటర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.

సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి సర్వే పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఎలాంటి లోపాలు లేదా పొరపాట్లు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి సేకరించే వివరాలను పారదర్శకంగా నమోదు చేసి, ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

ప్రత్యేకంగా కేటీపీఎస్, సింగరేణి ప్రాంతాల్లో జనగణన సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని, అక్కడి ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పూర్తి స్థాయిలో వివరాల సేకరణ చేపట్టాలని సూచించారు. జనగణన కార్యక్రమం విజయవంతంగా పూర్తయ్యేలా అధికారులు, సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, సూపర్వైజర్లు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలన , రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన: చింతకాని ఎస్సై



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా గురువారం చింతకాని మండలం వందనం గ్రామంలో నిర్వహించిన గ్రామసభ కార్యక్రమంలో చింతకాని పోలీసుల ఆధ్వర్యంలో
రహదారి ప్రమాదాల నివారణ, గంజాయి (మత్తు పదార్థాల) నిర్మూలన మరియు సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్సై వీరేందర్ మాట్లాడుతూ..నేటి డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ చాలా అప్రమత్తంగా ఉండాలని, ఆన్లైన్ మోసగాళ్లు రోజుకో కొత్త పద్ధతిలో అమాయకులను బురిడీ కొట్టిస్తూ డబ్బులు కాజేస్తున్నారన్నారు. వ్యక్తిగత సమాచారం, ఓటీపీ (ఌూ), లేదా బ్యాంక్ వివరాలను ఎవరికీ షేర్ చేయవద్దని, ఏదైనా అనుమానాస్పద లింక్లపై క్లిక్ చేయకూడదన్నారు.

గంజాయి మరియు ఇతర మత్తుపదార్థాల వాడకం వల్ల యువత భవిష్యత్తు అంధకారమవుతోందన్నారు. విద్యాసంస్థలు, పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా గంజాయి దందా పెరిగిపోతోందని, దీనివల్ల యువత ఆరోగ్యం క్షీణించి, చదువును మధ్యలోనే ఆపేయడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం జరుగుతోందని పేర్కొన్నారు.

తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనిస్తూ ఉండాలన్నారు. గంజాయికి బానిసైన యువతకు నిపుణుల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించి, డి-అడిక్షన్ సెంటర్ల ద్వారా చికిత్స అందించడం జరుగుతుందన్నారు. యువతను శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంచడానికి క్రీడలు, యోగా, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల వైపు మళ్లించాలన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించడానికి అతివేగాన్ని నియంత్రించడం, ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించడం, వాహనం నడిపేటప్పుడు మొబైల్ ఫోన్లు, మద్యం వంటి పరధ్యానాలకు దూరంగా ఉండటం అత్యంత ముఖ్యమన్నారు.

ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి (వీ=ా), సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఇతర శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాతర్లపాడు గ్రామంలో నాగలవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల కరపత్రాలు ను ఓపెనింగ్ చేసిన పాతర్లపాడు గ్రామ ఉప సర్పంచ్ దారెల్లి సురేష్..



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండల పరిధిలో పాతర్లపాడు గ్రామంలో నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2026-2027 విద్యాసంవత్సరము సంబంధించిన కొత్త అడ్మిషన్లు కరపత్రాలు గ్రామపంచాయతీ కార్యాలయంలో పాతర్లపాడు గ్రామ ఉప సర్పంచ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచ్ మాట్లాడుతూ....తెలుగు మరియు ఇంగ్లీష్ మీడియం లో ఒత్తిడి లేని విద్యను ఉచితంగా అందించుటకు. ఎంపీసీ, బైపీసీ, సి ఈ సి, హెచ్ఈ సి, ఏల్ ఎం డడి టీ, ఏ సి పి డఎం మొదలకు ఈ కోర్సులు ఉన్నవి. నాగులవంచ జూనియర్ కళాశాల విద్యార్థులు భవిష్యత్తును వారి కలలను సాకారం చేయటమే లక్ష్యముగా భావించి పనిచేస్తున్న ప్రిన్సిపల్ శ్రీ పి.నవీన్ బాబు గారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ సంవత్సరం టెన్త్ క్లాస్ విద్యార్థులు నాగులవంచ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ లో చేరి పాతర్లపాడు గ్రామనికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని మరియు గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ. పి. నవీన్ బాబు అధ్యాపకులు శ్రీ. కృష్ణార్జునరావు,ఆరోగ్య వర ప్రసాద్,శ్రీ. అల్లు విజయ్, వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, రాంబాబు, ఆయూబ్, నాగేశ్వరరావు, గ్రామస్తులు, యువతీ యువకులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నన్నక రుహిక పుష్పాలంకరణ వేడుక



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** తెలుగుదేశం పార్టీ జిల్లా సీనియర్ నాయకులు నన్నక గోపాలరావు, వెంకట నరసమ్మ ల మనమరాలు(నన్నక శ్రీనివాసరావు - ఉషా ల ఏకైక పుత్రిక) రుహిక పుష్పాలంకరణ వేడుక కోదుమూరు జ్యోతి ఫంక్షన్ హాల్లో గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిఆర్ఎస్ నాయకులు మంకెన రమేష్ , బిజెపి నాయకులు తాటికొండ రామక్రిష్ణ, సిపిఎం నాయకులు నన్నక కృష్ణమూర్తి, బండ్లమూడి వెంకటేశ్వర్లు, ఆలస్యం నాగేశ్వరరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాలు అంబటి శాంతయ్య, పద్మ, నన్నక నాగేశ్వరరావు, లక్ష్మి లు చిన్నారి రుహికను అక్షంతలు వేసి ఆశీర్వదించారు.

# మన బడి -- మన బాధ్యత!

- చిన్నమండవ గ్రామ ప్రజలందరికీ విజ్ఞప్తి
- ఏ దేశ ప్రగతి అయినా... ఆ దేశ తరగతి గదిలోనే మొదలవుతుంది"
- మన పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడం తల్లిదండ్రులుగా మన అందరి కనీస బాధ్యత.
- మరీదు నరేష్



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి** అందుకే... ఒక బాధ్యతగల తండ్రిగా, మన చిన్నమండవ గ్రామ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి నా వంతు తోడ్పాటునందించాలని మనస్ఫూర్తిగా నిర్ణయించుకున్నాను.

ఈ విద్యా సంవత్సరం నుండి నా ఇద్దరు పిల్లలను మన ప్రభుత్వ బడిలోనే చదివించాలని గర్వంగా నిర్ణయం తీసుకున్నాను. దీని కోసం నా పిల్లల ప్రైవేటు స్కూల్ అడ్మిషన్ కూడా రద్దు చేసుకున్నా.

కేవలం పిల్లలను బడికి పంపడమే కాదు... బడి ప్రారంభమైన తర్వాత, ప్రతి రోజూ నేను స్వయంగా పాఠశాలకు వెళ్ళి మన పిల్లలకు పెట్టే మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలిస్తాను.

ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతి రోజూ పౌష్టికాహారం అందుతుందో లేదో దగ్గరుండి చూసుకుంటాను.

ఈ మంచి ప్రయత్నం గురించి మన గ్రామ సర్పంచ్ పర్స రామచంద్రరావు కూడా ప్రత్యేకంగా మాట్లాడారు. మన పాఠశాల అభివృద్ధికి గ్రామ పంచాయతీ మరియు సర్పంచ్ మద్దతు మన గ్రామ పెద్దలు తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందని, గ్రామస్తులందరూ ఇందులో భాగస్వాములు కావాలని వారు కోరారు..దీనికి నేను నా పూర్తి మద్దతు తెలుపుతున్నాను.

మార్పు మన ఇంటి నుంచే మొదలుకావాలి

నాతో పాటు మీరందరూ కూడా మీ పిల్లలను మన ప్రభుత్వ బడికే పంపండి. విద్యావంతులైన ఉపాధ్యాయులు, మెరుగైన వసతులతో ఉన్న మన బడిని మనమే కాపాడుకుందాం.

మన పిల్లల ఆరోగ్యం, చదువు... మన ఊరి భవిష్యత్తు!

## నాగులవంచ--చింతకాని రహదారి వయా తుమ్మలమ్మ చెరువు రహదారి నిర్మాణ పనులు వేగవంతం వెట్ మిక్స్ నాణ్యతను పరిశీలించిన అధికారులు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు మన్య శ్రీ మల్లు భట్టి విక్రమార్క కృషితో 6.5 కొట్ల రూపాయలతో మంజూరైన నాగులవంచ--చింతకాని వయా తుమ్మలమ్మ చెరువు రహదారి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ రహదారి నిర్మాణంలో భాగంగా వెట్ మిక్స్ పనులు చేపట్టగా, పంచాయతీరాజ్ డివిజనల్ ఇంజనీర్ కుతంబాక శ్రీనివసరావు వెట్ మిక్స్ నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా మత్కేపల్లి-ూవీజ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు ఏఈ రఘు దేరంగుల బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పనుల పురోగతిని పరిశీలించిన అధికారులు, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రహదారి నిర్మాణం జరుగుతోందని తెలిపారు.

ఈ సందర్భంగా అంబటి మాట్లడుతూ రహదారి నిర్మాణం పూర్తయిన తర్వాత మండల కేంద్రం అయిన చింతకానికి ప్రజలు సులభంగా చేరుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. అలాగే, ఈ మార్గంలో ఉన్న తుమ్మలమ్మ చెరువు పరిసరాలు ప్రకృతి సౌందర్యంతో ఎంతో ఆహ్లాదకరంగా ఉండటంతో ప్రయాణికులకు ప్రత్యేక అనుభూతిని కలిగిస్తాయని . ఈ రహదారి అందుబాటులో కి రావడంతో నాగులవంచ, తుమ్మలమ్మ చెరువు పరిసర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడి, ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడనుంది అని,

తుమ్మలమ చెరువుని పర్యటక కెంద్రంగా అబివృద్ధి చేసే అంశాన్ని డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకవెళతాము అని అంబటి అన్నరు


# ప్రజల ఆశీర్వాదమే నా బలం, చివరి రక్తపు బొట్టు వరకు ప్రజాసేవలోనే ఉంటా.

**మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూన్ 04,** రాజకీయాలకు అతీతంగా, తన పుట్టిన గడ్డైన పాతపాల్వంచలో మాజీ మంత్రి, ప్రజానాయకుడు వనమా వెంకటేశ్వరరావు శ్రీమతి వనమా పద్మావతి ని పాతపాల్వంచ ప్రజలు, అభిమానులు, పాతతరం నాయకులు, స్నేహితులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ, ప్రజల ఆశీర్వాదమే నా బలం. నా జీవితం ఒక తెరిచిన పుస్తకం. ప్రజల ఆదరణ, అభిమానుల అండదండలతోనే అంచెలంచెలుగా రాజకీయంగా ఎదిగాను. పాతపాల్వంచ గ్రామంలో ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన నేను, గ్రామ సర్పంచ్‌గా ప్రజాసేవను ప్రారంభించి, మున్సిపల్ చైర్మన్‌గా, ఆర్టీసీ చైర్మన్‌గా, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసే అవకాశం ప్రజల వల్లే దక్కింది అని అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గం నాకు కన్నతల్లి లాంటిది. ఈ ప్రాంత ప్రజలు, రైతులు, కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో ఉద్యమాలు చేశాను. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలు కూడా చేశాను. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నాను. ప్రజలు మెచ్చే విధంగా పాలన అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేశాను అని పేర్కొన్నారు. పాతపాల్వంచ మట్టి నుంచి ప్రారంభమైన తన రాజకీయ ప్రస్థానం ఐదు దశాబ్దాలకు పైగా కొనసాగిందని, తన జీవితంలో సంపాదించుకున్న అతిపెద్ద ఆస్తి ప్రజల ప్రేమాభిమానాలేనని వనమా అన్నారు. నా చివరి రక్తపు బొట్టు వరకు ప్రజాసేవలోనే కొనసాగుతాను. ప్రజల కోసం పనిచేయడమే నా జీవిత లక్ష్యం అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అభిమానులు వనమా ఐదు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం, ప్రజాసేవలో ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. వనమా దంపతులతో కలిసి పాత జ్ఞాపకాలను పంచుకుంటూ భావోద్వేగ క్షణాలను ఆస్వాదించారు. పుట్టిన ఊరి ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై వనమా దంపతులను ఘనంగా సత్కరించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో హరి సత్యనారాయణ,శేషం రాజు, జాన్మియా, గంధమల రాజయ్య,ముత్యాల వీరభద్రం,పరిటాల విష్ణుమూర్తి,దేవదానం,అల్లం వెంకట్రామయ్య,మాజీ ఎమ్మెల్యే పిచ్చయ్య మనవరాలు జయమ్మ,చాంద్ పాషా, ఎస్కే ఖాసిం, ముత్యాల రమణమూర్తి, కార్పొరేటర్లు బత్తుల మధుచంద్, జీవీఆర్, గుణచరిత్,పాత పాల్వంచ ప్రజలు,ముత్యాల ప్రవీణ్, బత్తుల నాగరాజు,కిలారి సుజాత, డాక్టర్ మస్తాన్,వాటర్ ప్లాంట్ గౌస్, పిల్లల గంగాధర్,బొందిలి శేషగిరి, యాదయ్య, ఏనుగుల శ్రీను,మిరియాల అలివేలు జూపెల్లి దుర్గాప్రసాద్,కంచర్ల రామారావు, వాసుమల్ల గౌతమ్,అల్లి సాయికిరణ్, ప్రణయ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు 'ముఖ్యమంత్రి సహాయనిధి' అండ



**51 మంది లబ్ధిదారులకు 16.16 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

**ఖమ్మం రూరల్, ఏదులాపురం వాసులకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో అందజేత**

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం :** వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 51 మంది లబ్ధిదారులకు రూ. 16,16,500 విలువైన చెక్కులను దయాకర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. లబ్ధిదారుల్లో ఖమ్మం రూరల్ మండలానికి చెందిన వారు 30 మంది, ఏదులాపురం మున్సిపాలిటీకి చెందిన వారు 21 మంది ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడమే కాకుండా, సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందిస్తూ భరోసా కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి, ఆయా ప్రాంతాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 14న ఇల్లందులో రెండు రాష్ట్రాల స్థాయి నృత్య పోటీలు

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం :** కీర్తిశేషులు బాల, సాయి జ్ఞాపకార్థం వెంకట్ డ్యాన్స్ అకాడమీ, వీబీసీసీ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న ఇల్లందులోని సీఈఆర్ క్లబ్‌లో రెండు రాష్ట్రాల స్థాయి (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) నృత్య పోటీలు నిర్వహించనున్నారు. ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో గురువారం ఈ పోటీల గోడపత్రిక (బ్రోచర్)ను క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ తుంబూరు దయాకర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళలు యువతలో క్రమశిక్షణను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రతిభావంతులకు ఈ పోటీలు ఒక మంచి వేదికని కొనియాడారు. ఈ నెల 14న ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ పోటీలలో వెస్ట్రన్, ఫోక్, క్లాసికల్ విభాగాల్లో జూనియర్, సీనియర్ గ్రూప్స్‌తో పాటు సోలో, డ్యూయెట్ ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీదారులు నృత్యం చేయాల్సిన పాటలను పెన్ డ్రైవ్ లేదా మొబైల్‌లో తీసుకురావాలని, క్లాసికల్ నృత్యానికి 5 నిమిషాలు, ఫోక్, వెస్ట్రన్‌కు 4 నిమిషాల సమయం కేటాయించనున్నట్లు తెలిపారు. ప్రతి విభాగంలో కనీసం 10 ఎంట్రీలు ఉంటేనే బహుమతులు అందజేస్తామని, విజేతల ఎంపికలో న్యాయ నిర్ణేతలదే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. పోటీల్లో పాల్గొనే వారందరికీ ప్రశంసా పత్రంతో పాటు ఉచిత భోజన వసతి కల్పిస్తామని, విజేతలకు



ఆకర్షణీయమైన నగదు బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల నృత్య కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ పోటీలను జయప్రదం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. పోటీల రిజిస్ట్రేషన్ , ఇతర వివరాలకు కడారి వెంకటేష్ (8374579497, 7989163958), సాయి మాస్టర్ (9030099139) నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

# మంచాల తహసీల్దార్ కార్యాలయంలో పాత తెలంగాణ తల్లి చిత్రపటం ఏర్పాటు వివాదం..



**రంగారెడ్డి జిల్లా, మంచాల, సికె న్యూస్ ప్రతినిధి** రంగారెడ్డి జిల్లా మంచాల మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో పాత తెలంగాణ తల్లి చిత్రపటాన్ని ఉపయోగించడం వివాదాస్పదంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నూతన తెలంగాణ తల్లి విగ్రహం, చిత్రపటాలను అధికారికంగా అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికీ పాత చిత్రపటాలనే ఉపయోగించడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు విమర్శిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాల్లో నూతన తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయడంతో పాటు, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కొత్త చిత్రపటాలతో కార్యక్రమాలు నిర్వహించాలని సూచనలు జారీ చేసింది. అయినప్పటికీ మంచాల తహసీల్దార్ కార్యాలయంలో రెండు రోజుల క్రితం నిర్వహించిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో పాత చిత్రపటంతో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడం అధికారుల ప్రధాన బాధ్యత అయినప్పటికీ, కొంతమంది అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కూడా ఇదే నిర్లక్ష్యం కొనసాగుతోందని, ఇలాంటి ఘటనలు దానికి నిదర్శనమని పేర్కొంటున్నారు. కార్యక్రమంలో దాదాపు పదిమంది అధికారులు పాల్గొన్నప్పటికీ, ఎవ్వరూ ఈ తప్పును గుర్తించకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోందని కాంగ్రెస్ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ఇలాంటి నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.వి.వి. ప్రసాద్ రావు, సీనియర్ అసిస్టెంట్ జగన్, ఆర్ఐలు శ్రీనివాస్, రమేష్, జూనియర్ సహాయకులు నాగరాజు, సహార, హేమంత్, వీఆర్ఏలు భాస్కర్, మణికంఠ, వెంకటయ్య, ఆపరేటర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌లో ముగ్గురు ఎబోలా వైరస్



ప్రపంచవ్యాప్తంగా ఎబోలా ఆందోళనల నేపథ్యంలో భారత్‌లో నూ వైరస్ కలకలం రేపింది. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాలో ఎబోలా వైరస్ అనుమానితులను గుర్తించడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కాంగో, ఇథియోపియా, ఉగాండా దేశాల నుంచి ముగ్గురు వ్యక్తులు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ అభిజిత్ సింగ్ తెలిపారు. ప్రస్తుతం ఈ ముగ్గురు వ్యక్తుల ఆచూకీని గుర్తింపు, వారి పర్యవేక్షించే ప్రక్రియ కొనసాగుతోంది. కేంద్ర సంస్థల నుంచి అందిన హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. అయితే, ఇప్పటివరకు వారిలో ఎవరికీ ఎబోలా సోకినట్లు నిర్ధారణ కాలేదని తెలిపింది. ముందు జాగ్రత్త చర్యగా ఆ ముగ్గురు వ్యక్తులను గృహ నిర్బంధంలోనే వైద్య పర్యవేక్షణలో ఉంచినట్లు పేర్కొంది.

**భారత ప్రభుత్వం కీలక అడ్వైజరీ**

ఇదిలా ఉండగా కాంగో, ఉగాండా వంటి ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వేగంగా వ్యాపిస్తోంది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం పౌరులకు కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల్లో ప్రయాణించినా లేదా ఆ దేశాల మీదుగా వచ్చిన ప్రయాణికులు స్వీయ నిర్బంధంలోకి వెళ్లాలని సూచించింది. ఈ మేరకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ మంగళవారం ఓ ప్రకటన చేసింది. భారత్‌లో ఇప్పటివరకు ఎబోలా కేసులు ఏవీ నిర్ధరణ కాలేదని క్లారిటీ ఇచ్చింది. ఎవరైనా గత 21 రోజుల్లో ఎబోలా ప్రభావిత దేశం నుంచి వచ్చినా, లేదా ఆ దేశం మీదుగా ప్రయాణించినా జ్వరం, కండరాల నొప్పి, తలనొప్పి, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే స్వీయ నిర్బంధంలోకి వెళ్లాలని చెప్పింది. వెంటనే ఆరోగ్య అధికారులకు సమాచారం అందించాలని పేర్కొంది. ముందస్తు సమాచారంతో మీ ప్రాణాలను కాపాడటంతో పాటు వ్యాధి వ్యాప్తిని కూడా నిరోధించవచ్చని వివరించింది. ఈ సందర్భంగా అధికారుల సాయం కోసం 1075 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని వివరించింది.

**ఎయిర్?పోర్టుల్లో కఠిన తనిఖీలు**

అంతేకాకుండా, భద్రత, ముందు జాగ్రత్త చర్యగా ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల కోసం అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో కఠినమైన తనిఖీలు చేస్తున్నారు. ముఖ్యంగా దిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కఠిన తనిఖీలు చేపట్టారు. అలాగే సముద్ర ఓడరేవుల వద్ద కఠినమైన నిఘాను కొనసాగిస్తున్నారు. కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలను అధిక ప్రమాదం ఉన్న దేశాలుగా గుర్తించారు. ఈ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్క్రీనింగ్, వైద్య పరీక్షలను తప్పనిసరి చేశారు. అంతేకాకుండా, ఎబోలా అనుమానిత కేసులను ఎదుర్కోవడానికి ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు, ఆసుపత్రులను సిద్ధం చేశాయి.

మరోవైపు కాంగో జాతీయ ప్రజారోగ్య సంస్థ నివేదిక ప్రకారం దేశంలో ఇప్పటివరకు 363 ఎబోలా కేసులు నమోదయ్యాయి. బుండిబుగ్యో వైరస్ కారణంగా 62 మంది మరణించినట్లు వెల్లడించింది. వ్యాధి సోకిన వారిని కనుగొనడంలో కొంత మెరుగుదల కన్పించినట్లు అధికారులు చెప్పారు. ఉగాండాలో కూడా 15 కేసులు నిర్ధరణ కాగా, ఒకరు మరణించారు. ఆఫ్రికా దేశాల్లో ఎబోలా కేసులు పెరుగుతుండటంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు అప్రమత్తమయ్యాయి. అటు ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) దీనిని 'అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి'గా ప్రకటించింది.

ఇదిలా ఉండగా, హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడికి ఎబోలా వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించారు. సూడాన్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మహ్మద్ అనే ప్రయాణికుడికి స్క్రీనింగ్ కేంద్రంలో పరీక్షలు నిర్వహించగా అతడికి ఎబోలో వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన వైద్యసిబ్బంది, అతన్ని గాంధీ ఆసుపత్రిలోని ఐసోలేషన్ సెంటర్‌కు తరలించారు. శాంపిల్స్ సేకరించి జజవీదీకి పంపించినట్టు గాంధీ ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

# ప్రతిపక్షాల సమావేశానికి డీఎంకే దూరం



దిల్లీ వేదికగా జూన్ 8న జరగనున్న 'ఇండి' కూటమి భేటీకి డీఎంకే దూరంగా ఉండనుంది. ప్రతిపక్షాల ఐక్యతను చాటేందుకు ఇండి కూటమి నేతలు జూన్ 8న దేశ రాజధానిలో సమావేశం కానున్నారు. అయితే, తమిళనాడులో ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీతో డీఎంకేకు సంబంధాలు క్షీణించాయి. ఫలితంగా ఈ భేటీకి డీఎంకే నేతలు దూరంగా ఉండనున్నారు. ఈ సమావేశంలో సుమారు 17 ప్రతిపక్ష పార్టీలు పాల్గొనే అవకాశం ఉంది. ఈ భేటీలో చట్టసభల లోపల, బయట అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ విజయ్ నేతృత్వంలోని టీవీకేతో చేతులు కలపడం డీఎంకేకు ఆగ్రహం తెప్పించింది. ఇరు పార్టీల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలోనే ఇండి కూటమి భేటీకి, డీఎంకే గైర్హాజరు కావడం ఖాయంగా కనిపిస్తోంది.

మరోవైపు కూటమితో అంటీముట్టనట్లు వ్యవహరిస్తూ వచ్చిన టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఈ సమావేశానికి హాజరవుతారని సమాచారం. ఆమెతో పాటు ఇటీవల దాడికి గురైన టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా పాల్గొనే అవకాశం ఉంది. వీరితో పాటు పలు రాష్ట్రాల సీఎంలు, సీనియర్ నేతలు సమావేశానికి హాజరుకానున్నారు.

**'మా కార్యకర్తల మనోభావాలకు గౌరవం ఇచ్చి'**

అయితే, తమిళనాడు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తమకు చేసిన ద్రోహానికి తమ పార్టీ కార్యకర్తలు తీవ్ర మనస్తాపానికి గురయ్యారని డీఎంకే తెలిపింది. "డీఎంకే పార్టీ కార్యకర్తల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని, వాటికి గౌరవం ఇస్తున్నాం. ముఖ్యంగా కాంగ్రెస్ పాల్గొంటున్న సమావేశం కావడంతో జూన్ 8న దిల్లీలో జరగనున్న ఇండి కూటమి సమావేశంలో డీఎంకే పాల్గొనదు. అయితే, ఈ సమావేశానికి హాజరుకాకపోయినప్పటికీ, సమావేశంలో పాల్గొనే ఇతర పార్టీలు దేశ శ్రేయస్సుకు సంబంధించిన ఏవైనా అంశాలను ప్రస్తావిస్తే, వాటిపై ఎప్పటిలాగే తన గళాన్ని వినిపిస్తూనే ఉంటుంది" అని డీఎంకే పేర్కొంది.

**ఇకపై మేం ఇండి కూటమిలో భాగస్వాములం కాదు!**

మరోవైపు, తాము ఇకపై ఇండి కూటమిలో భాగస్వాములం కాదని, అందుకే ఈ సమావేశానికి హాజరుకావడం లేదుని డీఎంకే నాయకుడు టీకేఎస్? ఇళంగోవన్ పేర్కొన్నారు. డీఎంకేతో తమ బంధాన్ని తెంచుకుంటున్నామని కాంగ్రెస్ స్పష్టం చేసిందని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా తమ కార్యకర్తలు తీవ్రంగా శ్రమించారని తెలిపారు.

"తాము టీవీకేతో కలిసి ముందుకు సాగుతున్నామని, స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కూడా టీవీకేతోనే కలిసి పోటీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. దీని అర్థం వారు ఇకపై మాతో లేరని. అలాంటప్పుడు మేము ఇండి కూటమిలో ఎలా కొనసాగగలం? అందుకే మేము ఈ సమావేశానికి వెళ్లడం లేదు. కూటమిలో భాగంగా పోటీ చేసి గెలిచిన ఐదుగురు ఎమ్మెల్యేలు వారి వెంట ఉన్నారు. మేం వారికి ఒక రాజ్యసభ స్థానాన్ని కూడా కేటాయించాం. ఇన్ని చేసిన తర్వాత కూడా, ఆ ఎమ్మెల్యేలు కనీసం వచ్చి మా నాయకుడికి కృతజ్ఞతలు కూడా తెలుపలేదు. తాము టీవీకేతో వెళ్తున్నామని, ఇకపై డీఎంకేతో తమకు పొత్తు లేదని వారు ప్రకటించారు. సహజంగానే, ఇది మా కార్యకర్తల మనసులను తీవ్రంగా గాయపరిచింది. వారి గెలుపు కోసం మా కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేశారు. 28 నియోజకవర్గాల్లో వారు కాంగ్రెస్ అభ్యర్థుల కోసం శ్రమించారు. అందుకే మేం సమావేశంలో పాల్గొనం. అసలు ఇండి కూటమిలోని ఎన్ని పార్టీలు ఈ సమావేశంలో పాల్గొంటాయో వేచి చూద్దాం" అని ఇళంగోవన్ పేర్కొన్నారు.

**లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీకి దూరంగా కూర్చోవనున్న డీఎంకే!**

ఇదిలా ఉండగా, లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీకి దూరంగా కూర్చోవడానికి డీఎంకేకు అనుమతి లభించింది. ఈ మేరకు లోక్‌సభ సచివాలయం నుంచి అనుమతి లభించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. తమిళనాడులో విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వంలో కాంగ్రెస్ భాగస్వామి కావటంతో డీఎంకే ఈ నిర్ణయం తీసుకుంది. తమిళనాడులో కాంగ్రెస్ తమ మిత్రపక్షం కానందున లోక్‌సభలో తమ ఎంపీల సీటింగ్‌ను మార్చాలని గతనెలలోనే లోక్‌సభ సెక్రటేరియట్‌ను డీఎంకే కోరింది.

# మోదీ హయాంలో విద్యావ్యవస్థ నాశనం

నీట్ విద్యార్థిని బలవన్మరణంపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేపదే జరుగుతున్న పేపర్ లీక్ వివాదాల వల్ల విద్యార్థుల కలలు చెదిరిపోతున్నాయని మండిపడ్డారు. మోదీ హయాంలో నాశనమైన విద్యా వ్యవస్థకు భారతదేశ యువ తరం మూల్యం చెల్లిస్తోందని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని మౌగంజ్ జిల్లాకు చెందిన ఆకాంక్ష అనే నీట్ అభ్యర్థిని నీట్ అక్రమాలపై మానసికంగా ఒత్తిడికి గురై నాగపూర్‌లో బలవన్మరణానికి పాల్పడినట్లు మీడియాలో వచ్చిన కథనాలపై రాహుల్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. "ఆకాంక్ష డాక్టర్ అయ్యి సమాజానికి సేవ చేయాలని ఆశపడింది. ఓ సాధారణ రైతు అయిన ఆమె తండ్రి, కుమార్తె కలను నిజం చేయడానికి కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా 3లక్షల అప్పు తీసుకున్నారు. నాగపూర్‌లో ఆమె శిక్షణ తరగతులకు వెళ్లేందుకు వీలుగా తండ్రి వంటవాడిగా ఉద్యోగం చేశారు. ఓ తండ్రిగా ఆయన చేయగలిగినదంతా చేశారు, కానీ నీట్ పేపర్ లీక్ కారణంగా పరీక్ష రద్దయింది. పరీక్ష రద్దు కావటాన్ని తట్టుకోలేక ఆకాంక్ష బలవన్మరణానికి పాల్పడింది. ఆకాంక్ష మరణం కేవలం బలవన్మరణం కాదు, అది ప్రధాని మోదీ హయాంలో అవినీతి, కుప్పకూలిన విద్యావ్యవస్థ చేసిన ఘోర పాపం. ఇక ధర్మేంద్ర ప్రధాన్ విషయానికొస్తే? ఆయన ఈనాటికీ తన పదవిలో గట్టిగా పాతుకుపోయి ఉన్నారు. అవే పాత కమిటీలు, బదిలీలు, విచారణలు. సంస్కరణలు లేవు న్యాయం లేదు." ఇదిలా ఉండగా, పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్?టీఏ) నిర్వహించాల్సిన నీట్ (యూజీ) 2026 పరీక్షను మే 12న రద్దు చేశారు. దీంతో దేశంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థి సంఘాల తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ఈ ఆరోపణలపై స్పందించిన ప్రతిపక్షాలు కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్? చేశాయి. అయితే, నీట్? పరీక్షను తిరిగి జూన్ 21న మరోసారి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తు న్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, ఈ వ్యవహారంలో సీబీఐ అధికారులు ఇప్పటివరకు 13 మందిని అరెస్టు చేశారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి ఐదుగురి నిందితులకు జూన్ 2 వరకు ఉన్న కస్టడీని 15 వరకు పొడిగిస్తూ మంగళ వారం దిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మంగీలాల్ ఖటిక్, వికాస్ బివాల్, దినేశ్ బివాల్, యశ్ యాదవ్, ధనుంజయ్ లోఖండేల జ్యుడిషియల్ కస్టడీని పొడిగించాలని కోరుతూ సీబీఐ అభ్యర్థనను ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ అజయ్ గుప్తా అంగీకరిస్తూ తీర్పును వెలువరించారు. మరోవైపు, నీట్ యూజీ పునఃపరీక్షకు చదువుకోవడానికి పుస్తకాలు కావాలని కోరుతూ, పేపర్ లీక్ నిందితుడు యశ్ యాదవ్ దాఖలు చేసి న దరఖాస్తును మంగళవారం రౌస్ అవెన్యూ కోర్టు అనుమతించింది. ఈ మేరకు నిందితుడి తరఫు న్యాయవాది పేర్కొన్నారు.

**ప్రధాన సూత్రధారి నివాసం కూల్చివేత**

ఇక, నీట్-యూజీ పేపర్ లీకేజీ కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న రిటైర్డ్ ప్రొఫెసర్ పీవీ కులకర్ణి నివాసంపై మహారాష్ట్ర మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. బీడ్‌లోని షాహునగర్‌లో గతంలో తన పూర్వీకులు ఉన్న ఇంటి స్థలంలో నాలుగంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అయితే, ఇటీవల పేపర్‌లీక్ వ్యవహారం వెలుగు చూసిన నేపథ్యంలో ఆ కట్టడంపై స్థానిక మునిసిపల్ అధికారులు దృష్టి సారించి సర్వే నిర్వహించగా, అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో ఆయనకు నోటీసులు జారీ చేశారు. అనంతరం బుల్డోజర్‌తో ఆ ఆక్రమణలను తొలగించారు.

## మరోసారి డీలిమిటేషన్ బిల్లు.. డీఎంకే, టీఎంసీ మద్దతు?




**ఢిల్లీ:** పార్లమెంట్ ముందుకు మరోసారి డీలిమిటేషన్ బిల్లు వచ్చే అవకాశం ఉంది. దేశంలోని ప్రస్తుతం మారిన రాజకీయ పరిస్థితుల్లో బిల్లు పాస్ అయ్యేందుకు అవకాశాలు ఉన్నాయి. వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును ప్రవేశ పెట్టేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత రాజకీయ సమీకరణాలు మారాయి. డీ లిమిటేషన్ పై తమ విధానంలో పునరాలోచన దిశగా డీఎంకే ఉన్నట్లు తెలుస్తోంది. తమిళనాడు రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని, తమ ప్రాతినిధ్యం తగ్గకుండా ఉంటే వ్యతిరేకించాల్సిన అవసరం లేదని డీఎంకె వర్గాలు అంటున్నాయి. డీఎంకే నేతలతో అంతర్గతంగా కేంద్ర ప్రభుత్వ పెద్దలు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో వాజ్‌పేయీ మంత్రివర్గంలో డీఎంకే భాగస్వామిగా ఉంది. తమిళనాడులో డీఎంకేకు కాంగ్రెస్ పార్టీ గుడ్‌బై చెప్పడంతో పరిణామాలు మారాయి. డీ లిమిటేషన్ బిల్లుకు పలువురు టీఎంసీ ఎంపీలు కూడా సహకరించే అవకాశం ఉంది. డీఎంకే, టీఎంసీ పార్టీలకు లోక్ సభలో 50 మంది ఎంపీలు ఉన్నారు. దేశవ్యాప్తంగా 50 శాతం లోక్ సభ, 50 శాతం అసెంబ్లీ సీట్లు పెంచేలా డీ లిమిటేషన్ బిల్లును రూపొందించారు. గత ప్రత్యేక సమావేశాల్లో 54 ఓట్ల తేడాతో బిల్లు వీగిపోయింది. జమిలి ఎన్నికల బిల్లును కూడా వీలైనంత త్వరగా ప్రవేశపెట్టి యోచనలో ప్రభుత్వం ఉంది. వర్షాకాల సమావేశాల తొలి వారంలో జేపీసీ నివేదికను వన్ నేషన్ వన్ ఎలక్షన్ కమిటీ ప్రవేశపెట్టనుంది. రెండు దశల్లో దేశవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహించేలా ప్రతిపాదనలు ఉన్నాయి

## బీజేపీ రాజ్యసభ అభ్యర్థుల జాబితా విడుదల

ఢిల్లీ: బీజేపీ రాజ్యసభ సభ్యుల జాబితాను విడుదల చేసింది. మధ్యప్రదేశ్ నుంచి తరుణ్ చుగ్, రజనీష్ అగర్వాల్, గుజరాత్ నుంచి రాజుభాయ్ శుక్లా, ముకేశ్ భాయ్ రత్వ, మాన్సింగ్, జితేంద్ర మేక్జి భాయ్, మణిపూర్ నుంచి శారదా దేవి, రాజస్థాన్ నుంచి ఆల్క గుర్జర్, సతీష్ పునియా ,ఒడిశా నుంచి దేభాషిస్ సమంతరే, లు పోటీ చేయనున్నట్లు పార్టీ ప్రకటించింది. కాగా ఇటీవలే రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. జూన్ 18న పెద్దల సభకు ఎన్నికలు జరపనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. అదే రోజున ఫలితాలుంటాయి. దేశవ్యాప్తంగా 24 స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా ఏపీలో నాలుగు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.నామినేషన్ దాఖలుకు జూన్ 8 చివరితేదీ కాగా జూన్ 9న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. జూన్ 11 వరకూ విత్‌డ్రాకు సమయముంటుంది. జూన్ 20తో ఎన్నికల ప్రక్రియ ముగుస్తోంది

## దిల్లీ అగ్నిప్రమాద భవనంలో అనేక లోపాలు



దిల్లీ మాలవీయ నగర్‌లో జరిగిన అగ్నిప్రమాదం దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగుచూశాయి. మంటలు చెలరేగినప్పుడు భవనం పైకప్పు మార్గం మూసి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కారణంగానే లోపల ఉన్నవారు ప్రాణాలతో తప్పించుకునేందుకు అవకాశం లేకుండా పోయిందని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ఇంకా అనేక లోపాలను కూడా అధికారులు గుర్తించారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం, ఘటన జరిగిన తర్వాత పోలీసులు గెస్ట్ హౌస్‌లోని గదుల్లో సోదాలు నిర్వహించి దాదాపు 50 నుంచి 60 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సోదాల్లో సుమారు 30 పాస్‌పోర్ట్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు.

**దట్టమైన పొగ, ఊపిరాడకపోవడం వల్లే అత్యధిక మరణాలు**

ఇదిలా ఉండగా, దర్యాప్తు సమయంలో భవనం భద్రతా, మౌలిక సదుపాయాల్లో అనేక తీవ్రమైన లోపాలను కూడా అధికారులు గుర్తించారు. భవనం కిటికీలు, గ్లాసులు పూర్తిగా మూసివేసి ఉన్నాయని, ఫలితంగా పొగ బయటకు వెళ్లేందుకు ఎలాంటి మార్గం లేకుండా పోయిందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ అగ్నిప్రమాదంలో భవనంలోని మూడో అంతస్తు, బేస్‌మెంట్‌లో ఉన్నవారు ఎక్కువగా ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు తెలిపారు. దట్టమైన పొగ వల్ల ఊపిరి ఆడకనే అత్యధిక మరణాలు సంభవించినట్లు పేర్కొన్నారు. ఆ భవనంలో సరైన వెంటిలేషన్ ఏర్పాట్లు లేవని, ఎమర్జెన్సీ ఎగ్జిట్? గేటు కూడా లేదని దర్యాప్తులో వెల్లడైంది. ఈ లోపాల కారణంగా పొగ భవనం అంతటా వేగంగా వ్యాపించిందని, తరలింపు ప్రయత్నాలకు తీవ్ర ఆటంకం కలిగించిందని పేర్కొంది. మంటలను అదుపులోకి తెచ్చిన తర్వాత కూడా గెస్ట్ హౌస్‌లోని గదులు అత్యంత వేడిగా ఉన్నాయని, ఇది మంటల తీవ్రతను సూచిస్తోందని తెలిపాయి. ఈ ఘటనకు ప్రత్యక్ష సాక్షిగా భావిస్తున్న కేసర్ సింగ్ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

**చట్టవిరుద్ధంగా హోటల్‌లో అదనపు అంతస్తులు నిర్మించిన యజమాని**

మరోవైపు ఈ ఘటనపై దర్యాప్తు ముమ్మరం చేసిన దిల్లీ పోలీసులు మొత్తం 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పరారీలో ఉన్న హోటల్ మేనేజర్ జై మిశ్రాను పట్టుకునేందుకు 5 బృందాలు గాలిస్తుండగా మిగిలిన 5 బృందాలు ఇతర కోణాల్లో విచారణ జరుపుతున్నాయి. బుధవారం హోటల్ యజమాని లవ్‌కేశ్ శర్మ అరెస్టుకు ముందు దేశం విడిచి పారిపోకుండా ఆయనతో పాటు ఆయన భార్యపై ముందస్తు చర్యగా పోలీసులు లుక్ ఔట్ సర్క్యులర్ జారీ చేశారు. మొదట 2 అంతస్తులతో మాత్రమే హోటల్ ప్రారంభించిన యజమాని, ఆ తర్వాత చట్టవిరుద్ధంగా అదనంగా మరో రెండున్నర అంతస్తులను నిర్మించినట్లు విచారణలో తేలింది. మరోవైపు ఇప్పటివరకు ఐదుగురు మృతులను గుర్తించారు దర్యాప్తు అధికారులు. మిగిలిన బాధితుల గుర్తింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని తెలిపారు. వారిని గుర్తించేందుకు పోస్ట్‌మార్టం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మృతుల శరీరాలపై తీవ్రమైన కాలిన గాయాలు లేవని చెప్పాయి. ఘటనా స్థలంలో లభ్యమైన పాస్‌పోర్టుల ఆధారంగా విదేశీయుల గుర్తింపు ప్రక్రియను చేపట్టారు. ఆ గెస్ట్ హౌస్‌లో బస చేస్తున్న విదేశీయుల్లో అధిక శాతం మంది వైద్య వీసాలపై భారతదేశానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆ గెస్ట్ హౌస్‌లో ప్రతి నెలా సుమారు 80 మంది విదేశీయులు బస చేసేవారని తెలిపాయి. నిబంధనల ప్రకారం, విదేశీ అతిథుల కోసం సి-ఫారమ్‌లను క్రమం తప్పకుండా నింపి ఫారిన్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఖీ==ూ)కు సమర్పించేవారు. సమర్పించిన తర్వాత, విదేశీయుల వివరాలు దిల్లీ పోలీసు వ్యవస్థలో కూడా నమోదు చేస్తారు. దిల్లీలోని మాలవీయ నగర్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 21 మంది మరణించారు. వారిలో 11 మంది విదేశీయులు ఉన్నారు. రక్షించిన 58 మందిలో 35 మంది చికిత్స పొందుతున్నారు. 19 మంది పరిస్థితి అత్యంత విషమంగా ఉంది.

## సంపాదకీయం


# డిజిటల్ బీభత్సం

ప్రగతికి బాటలు వేయాల్సిన కృత్రిమ మేధ, నేరగాళ్ల చేతికి చిక్కి డిజిటల్ ప్రపంచాన్ని గడగడలాడిస్తోంది. ఒకప్పుడు సంక్లిష్టమైన కోడింగ్ నైపుణ్యమున్న సాంకేతిక నిపుణులకే సాధ్యమైన హ్యాకింగ్, నేడు అక్షరం ముక్కరాని వాళ్లకూ సులువైపోయింది. రానున్న రోజుల్లో ఏఐ ఆధారిత సైబర్ దాడులు ఏకంగా 400 శాతంమేర విజృంభిస్తాయని, 2026 చివరినాటికి వాటివల్ల జరిగే నష్టం లక్ష కోట్లను దాటుతుందన్న అంచనాలు ముప్పు తీవ్రతకు నిలువుటద్దం! 2025లో భారత్‌లో సైబర్ నేరాలు 24 శాతం పెరిగాయి. 28.15 లక్షల కేసులు నమోదై.. కోల్పోయిన సొమ్ము రూ.22,495 కోట్లకు చేరింది. 2025లో భారత్‌లో వారానికి సగటున 3,195 సైబర్ దాడులు జరిగాయని చెక్ పాయింట్ సాఫ్ట్‌వేర్ నివేదిక హెచ్చరించింది. పటిష్ఠంగా ఉన్నాయని భావిస్తున్న డిజిటల్ భద్రతా కవచాలు సైతం ఏఐ దాడులను నిరోధించలేకపోతున్నాయి. సైబర్ నేరాలవల్ల ప్రపంచవ్యాప్తంగా 2025లో అంచనా వేసిన నష్టం 10.29 లక్షల కోట్ల డాలర్లు కాగా, 2026 నాటికి అది 11.36 లక్షల కోట్ల డాలర్లకు చేరొచ్చని అంచనా. డిజిటల్ విప్లవం వెలుగుల్లో నేరాలు కూడా. దేదీప్యమానమవుతున్నాయి.

జనరేటివ్ ఏఐ రాకతో ఫిషింగ్ దాడులు కొత్తరూపు సంతరించుకున్నాయి. గతంలో స్పామ్ మెయిల్స్‌లో భాషా దోషాలుండేవి. తద్వారా వాటిని గుర్తించడం సులభంగా ఉండేది. కానీ ఇప్పుడు ఏఐ సాయంతో అచ్చం అధికారిక మెయిల్స్‌ను తలపించేలా, ఏమాత్రం తప్పుల్లేని సందేశాలు సృష్టిస్తున్నారు. డీప్‌ఫేక్ ఫిషింగ్ దాడులు 2025లో ఏకంగా 138 శాతం పెరిగాయి. వీటన్నింటికంటే భీతి గొల్పుతున్న అంశం డీప్‌ఫేక్ సాంకేతికత. కేవలం మూడు సెకన్ల ఆడియో ఉంటే చాలు, ఎదుటి వ్యక్తి గొంతును అచ్చుగుద్దినట్టు దించేయవచ్చు. 2025 విశ్లేషణ ప్రకారం 47 శాతం భారతీయ వయోజనులు ఏఐ వాయిస్ క్లోనింగ్ లేదా డీప్‌ఫేక్ మోసానికి గురయ్యారు. ఇది ప్రపంచ సగటు 25 శాతానికి దాదాపు రెట్టింపు. 2025లో భారత్‌లో డీప్‌ఫేక్ మోసాలవల్ల నష్టం రూ.70,000 కోట్లు అవుతుందని అంచనాలున్నాయి. కంటికి కనిపించేది నిజం కాదు. చెవికి వినిపించేది సత్యం కాదు అన్నట్లు –పిల్లల గొంతుతో తల్లిదండ్రులను భయపెట్టి డబ్బులు వసూలు చేయడం, కంపెనీ అధినేతల ముఖాలతో వీడియో కాల్స్ సృష్టించి కోట్లు కాజేయడం డిజిటల్ ప్రపంచంలో విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. హాంకాంగ్‌లో ఓ బహుళజాతి సంస్థ ఆర్థిక విభాగం ఉద్యోగి, తన సీఎఫ్‌ఓతోపాటు సహోద్యోగులంతా పాల్గొన్నట్టు కనిపించిన వీడియో కాల్ నిజమేనని నమ్మి రూ.200 కోట్లు బదలాయించాడు. అది మొత్తం డీప్‌ఫేక్ మోసం. భారత్‌లో 65 శాతం సంస్థలు డీప్‌ఫేక్ ఆధారిత దాడులను ఎదుర్కొన్నాయని 2026 థేల్స్ డేటా థ్రెట్ నివేదిక స్పష్టం చేసింది. 55 శాతం సంస్థలు ఏఐ తప్పుడు సమాచారంవల్ల నష్టపోయాయి. సామాజిక మాధ్యమాల్లో మనం వదిలే సమాచారాన్ని ఏఐ క్షుణ్ణంగా విశ్లేషిస్తోంది. ఎవరి ఆర్థిక స్థితిగతులు ఏమిటి? ఎవరి బలహీనతలేంటి? వంటి అంశాలను బేరీజు వేసి మరీ సైబరాసురులు వల విసురుతున్నారు. మనుషులు ఊహించలేనంత సంక్లిష్టమైన పాస్‌వర్డ్‌లను సైతం ఏఐ అల్గారిథమ్‌లు సెకన్ల వ్యవధిలో ఛేదిస్తున్నాయి. విద్యా సంస్థలు వారానికి సగటున 7,684 సైబర్ దాడులను, ప్రభుత్వ సంస్థలు 4,912 దాడులను ఎదుర్కొంటున్నాయి. అక్టోబర్ 2024 నుంచి సెప్టెంబర్ 2025 మధ్య 26.5 కోట్లకు పైగా మాల్‌వేర్ ముప్పులు గుర్తించబడ్డాయి. అంటే నిమిషానికి సగటున 505 దాడులు జరిగినట్లు. 2026లో మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ అత్యధికంగా దెబ్బతిన్నాయి. ఆర్థిక సంస్థలు, ఐటీ మౌలిక వ్యవస్థ, ప్రభుత్వ డేటాపై లక్ష్యిత దాడులు పెరిగాయి.

స్వయంగా నిర్ణయాలు తీసుకుని పనులు చక్కబెట్టే ఏజెంటిక్ ఏఐ వైపు సాంకేతికత అడుగులేయడం విప్లవాత్మకమైన మార్పే అయినప్పటికీ, మానవ పర్యవేక్షణలేని ఈ స్వయంప్రతిపత్తి కత్తిమీద సాము వంటిదే. బ్యాంకింగ్, వైద్యం, విద్యుత్ గ్రిడ్లవంటి కీలక రంగాల్లో ఈ డిజిటల్ ఏజెంట్లు చేసే చిన్న పొరపాట్లు పెను ఆర్థిక నష్టాలకు, భద్రతాపరమైన విపత్తులకు దారితీసే ప్రమాదముంది. ఏఐ–ఆధారిత మోసాలు సాంప్రదాయ ధృవీకరణ వ్యవస్థలను సునాయాసంగా దాటేస్తున్నాయి. అధికారులు, రిలేషన్‌షిప్ మేనేజర్లు, వినియోగదారులను అచ్చంగా అనుకరిస్తూ ఖాతా స్వాధీనం, మోసపూరిత చెల్లింపులు చేయిస్తున్నారు. రక్షణ గోడలే కూలిపోతున్న తరుణంలో సామాన్యుడి భద్రత గాలిలో దీపమే అవుతోంది.

ఏఐ సృష్టించే ముప్పులను అదే సాంకేతికతతో తిప్పికొట్టాలి. బ్యాంకింగ్ రంగంలో మ్యూల్ అకౌంట్లను పసిగట్టేందుకు ఆర్బీఐ 'మ్యూల్ హంటర్ ఏఐ' టూల్ రూపొందించడం శుభపరిణామం. టెలికాం సంస్థలు కూడా ఘోస్ట్ సిమ్ నెట్‌వర్క్‌కు అడ్డుకట్ట వేసేలా ప్రత్యేక టూల్స్ రూపొందించాలి. యూపీఐ మౌలిక వ్యవస్థపై నెలకు 1,500 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతున్నాయి. ఇది సైబర్ నేరగాళ్లకు అత్యంత విలువైన లక్ష్యం. దొంగిలించబడిన నిధుల రికవరీ రేటు దేశవ్యాప్తంగా కేవలం 10–12 శాతం మాత్రమే. భారత్‌లో డిజిటల్ భద్రతపై అవగాహన తక్కువ. భారత్‌లో ఏఐ వాయిస్ స్కామ్ బాధితుల్లో 83 శాతం ఆర్థిక నష్టానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో సెర్ట్–ఇన్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు కృత్రిమ మేధను ఎదుర్కొనే సురక్షిత డిజిటల్ కవచాలు నిర్మించాలి. నాస్కామ్, ఐఎస్‌బీవంటి సంస్థలతోపాటు పారిశ్రామిక దిగ్గజాలు, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు ప్రభుత్వంతో కలిసి ఈ ప్రమాదాలపై నిరంతర అధ్యయనం, పరిశోధనలు సాగించాలి. ఏఐ సైబర్ సవాళ్లను ఎదుర్కోవడానికి జాతీయస్థాయిలో శక్తిమంతమైన విభాగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రతి ఏఐ ఏజెంట్‌కు కచ్చితమైన డిజిటల్ గుర్తింపు ఉండటంతో పాటు వాటి ప్రతి కదలికను నిశితంగా పర్యవేక్షించే లాగింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. ఆటోమేషన్ వేగంకంటే జవాబుదారీతనంతో కూడిన భద్రతే పరమావధిగా కఠినమైన నిబంధనలు, నమ్మకమైన ఫ్రేమ్‌వర్క్‌లను రూపొందించాలి. ఎంతటి అత్యాధునిక వ్యవస్థలైనా, కీలక నిర్ణయాలపై నియంత్రణ మాత్రం మనిషి చేతిలోనే ఉండాలి. ప్రజల్లో డిజిటల్ విజ్ఞత పెరగాలి. కృత్రిమ మేధ మానవాళికి అపురూప వరమవుతుందా? నేరగాళ్ల చేతిలో విధ్వంసకర ఆయుధంగా మారుతుందా? అనేది మన సన్నద్ధతపైనే ఆధారపడి ఉంది. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తే మన డిజిటల్ భవిష్యత్తు అంధకారంలోకి జారిపోవడం ఖాయం!



# ఆ సముద్రం.. ఇంకా పిలుస్తోంది!

పిల్లలకు నేర్చుకోవడం తెలుసు, అడ్డుపడకుండా ఉంటే చాలు. ఈ సత్యాన్ని తొంభైయేళ్ల క్రితమే గుర్తించిన గురువు –ఆంటోని బెనైజెస్. పిల్లలను పిల్లలుగా ఉండనివ్వాలన్న ఆయన జ్ఞానం ఆనాటి వ్యవస్థకు నేరంగా కనిపించింది. ఒక ప్రశ్న... ఒక విప్లవం!

స్పెయిన్ అంతర్యుద్ధ మంటల మధ్యలోనే ప్రభుత్వం ఒక చిన్న దీపం వెలిగించింది. దేశవ్యాప్తంగా ప్రాథమిక విద్యను నిర్బంధం చేసి, బోధనా మిషన్లు ఏర్పాటుచేసింది. ఆ మిషన్ పంపిన యువ ఉపాధ్యాయుడు బ్రుజెస్ అనే మారుమూల పల్లెకు వచ్చాడు. సూట్‌కేసులో బట్టలు మాత్రమే కాదు, బోలెడన్ని కొత్త ఆలోచనలూ తెచ్చుకున్నాడు. ఆ పల్లె పిల్లలకు అప్పటిదాకా బడి అంటే గోడలు, కొరడా, భయం. ఆంటోని వచ్చాక బడి అంటే ఆట, సంగీతం, ప్రశ్నలైంది. సంప్రదాయ వరుసకుర్చీలు లేవు. బెత్తం లేదు. విద్యార్థులు బృందాలుగా కూర్చుని, ఒకరికొకరు నేర్పుకుంటూ, తమకు నచ్చింది తామే ఎంచుకుంటూ నేర్చుకున్నారు. తరగతి గది సెలయేటి గట్టుదాకా విస్తరించింది. పాఠాలు పొలాల్లో మొదలయ్యాయి. అప్పుడే ఆ ప్రశ్న వేశాడు –"సముద్రం ఎలా ఉంటుంది?" పిల్లల ఊహలు రెక్కలల్లార్చాయి. "చాలా నీళ్ళు ఒకచోట చేరితే సముద్రం" అన్నారొకరు. మరొకరు బొమ్మ గీశారు, అలలు, చేపలు, తెల్లటి నురుగుతో. ఇంకొకరు "సముద్రమంటే ఆకాశం కిందకు దిగి నడుస్తున్నట్టు ఉంటుందేమో!" అమాయకత్వం, సృజనశీలత, స్వేచ్ఛ ఈ మూడూ కలిసి ఆ చిన్న తరగతిలో అద్భుతమైన కవిత్వం రాశాయి. ఆంటోని ఆ ఊహలన్నింటినీ ప్రెస్‌లో అచ్చువేశాడు. పుస్తకానికి పేరు పెట్టాడు –"సముద్రం! ఎన్నడూ చూడని పిల్లల ఊహల్లో!".

వాగ్దానం... నెరవేరని ప్రయాణం

పిల్లలు మరీ ఉత్సాహపడిపోయారు. "మాష్టారూ, నిజంగా సముద్రం చూపిస్తారా?" అని అడిగారు. ఆంటోని చిరునవ్వుతో "తప్పకుండా తీసుకెళ్తాను, నా సొంత ఊరికి" అన్నాడు. పిల్లలు రోజులు లెక్కపెట్టారు, అలలు వినాలని కలలుగన్నారు. ఇసుకలో కాళ్లు పెట్టాలని ఆశపడ్డారు.

కానీ ఆ రోజు రాలేదు.

1936 జూలైలో ఆంటోని మాయమయ్యాడు. ఛాందసులకు ఆయన బోధన నచ్చలేదు. పిల్లలు స్వేచ్ఛగా ఆలోచించడం వారికి ప్రమాదంగా కనిపించింది. స్పెయిన్ అంతర్యుద్ధం రగిలిన ఆ రోజుల్లో ఆంటోని ఏమయ్యాడో ఎవరికీ తెలియలేదు. సముద్రం కోసం ఎదురుచూసిన పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. గురువు కోసం వేచి అలసిపోయారు. కానీ ఆ వాగ్దానం గుండెల్లో చెరగకుండా నిలిచిపోయింది. ఆ మరుగున పడిన కథను 2013లో ఫ్రాన్సెస్క్ ఎస్ట్రిబానో తన పుస్తకంలో తవ్వి తీశాడు. "సముద్రాన్ని వాగ్దానం చేసిన ఉపాధ్యాయుడు." మరో పదేళ్ళకు అదే కథ వెండితెరపై "ద టీచర్ హూ ప్రామిస్డ్ ద సీ" అయింది. అప్పుడు ప్రపంచానికి తెలిసింది –ఆంటోని కేవలం టీచర్ కాదు, దర్శనమని.

సినిమాలో ఆంటోని అంటాడు.. "పిల్లలు ఎదగాలని బడిలో చేరుస్తారు. వాళ్లు త్వరగా పెద్దవాళ్లయిపోతే తమకు భారం కారనుకుంటారు. కానీ అసలు ఏదైనా నేర్చుకోవాలంటే పిల్లలు పిల్లలుగా ఉండాలి కదా ముందు". ఈ మాటలు వినగానే గుండెలో ఏదో గుచ్చుకుంటుంది. ఎందుకంటే నేటి బడులు చూస్తే అర్థమవుతుంది. మనం పిల్లల బాల్యాన్ని మార్కుల మూటలతో నింపేస్తున్నాం. నాలుగేళ్ళ పిల్లాడికి ర్యాంకు పోటీ, ఏడేళ్ళ పిల్లకు ట్యూషన్ భారం, పదేళ్ళ వయసులోనే "నీ భవిష్యత్తు ఏమిటి?" అనే ప్రశ్న. బాల్యం అనే సముద్రాన్ని చూపించే ముందే, బుక్కుల సంచి వారి భుజాలపై వేసి పరిగెత్తమంటున్నాం. నేర్చుకోవడం అంటే కేవలం జ్ఞాపకం చేసుకోవడం కాదు --- అనుభవించడం. ప్రశ్నించడం. తప్పు చేయడం. మళ్ళీ ప్రయత్నించడం. ఆంటోని చేసింది అదే. పాఠ్యపుస్తకంలో "సముద్రం" అని రాసి చదివించలేదు. బదులుగా "సముద్రం అంటే ఏమిటని నువ్వు అనుకుంటున్నావు?" అని అడిగాడు. ఆ ఒక్క ప్రశ్న పిల్లలను రచయితలుగా, కళాకారులుగా, ఆలోచనాపరులుగా మార్చింది.

ఆ సముద్రం ఇంకా పిలుస్తోంది. ఆంటోని లేడు. పిల్లలు పెద్దయ్యారు. బ్రుజెస్ పల్లె మారిపోయింది. కానీ ఆ ప్రశ్న మాత్రం చెరగలేదు --- "సముద్రం ఎలా ఉంటుంది?"

# జపాన్.. కొత్త మేల్కొలుపు!?



రెండో ప్రపంచ యుద్ధంలో అణుబాంబుల దెబ్బకు మోకరిల్లిన జపాన్, శాంతి రాజ్యాంగాన్ని రాసుకుని దశాబ్దాల పాటు నిరాయుధంగా నడిచింది. కానీ నేడు అదే జపాన్, మళ్లీ పదునైన కత్తిని చేతపట్టుకుంటోంది. సొంత సీఐఏ నిర్మించుకుంటోంది. హైపర్‌సోనిక్ క్షిపణులు తయారు చేసుకుంటోంది. ఆరోతరం యుద్ధ విమానాలు రూపొందిస్తోంది. ఆసియాలో కొత్త భూకంపం మొదలైంది. అది జపాన్ మేల్కొలుపు!

1945లో రెండో ప్రపంచ యుద్ధంలో పరాజయం తర్వాత, అమెరికా ఆధ్వర్యంలో జరిగిన సంస్కరణలు జపాన్ రాజ్యాంగంలో ఒక విప్లవాత్మక అధ్యాయం రాశాయి. ఆర్టికల్ 9.. యుద్ధాన్ని చట్టవిరుద్ధంగా ప్రకటించిన ఆ నిబంధన ప్రకారం, జపాన్ ఎటువంటి సైనిక దళాలను నిర్వహించకూడదు. దాడి చేసే విధానాలు అనుసరించకూడదు. ఇది ఒక ఓడిపోయిన దేశంపై విజేతలు విధించిన నిబంధన. అయితే శీతల యుద్ధ కాలం నుండి, ముఖ్యంగా 1990ల తర్వాత, జపాన్ ఆ రాజ్యాంగాన్ని క్రమంగా సరళంగా అర్థం చేసుకోవడం మొదలుపెట్టింది. "సమిష్టి ఆత్మరక్షణ" అనే భావన ద్వారా, దాడికి గురైన మిత్ర దేశాలకు సైనిక సహాయం చేయవచ్చని నిర్వచించుకుంది. జపాన్ సెల్ఫ్–డిఫెన్స్ ఫోర్సెస్ (జేఎస్‌డీఎఫ్) క్రమంగా శక్తిమంతంగా తయారై, అంతర్జాతీయ సైనిక విన్యాసాల్లో పాల్గొనడం ప్రారంభించింది.

షింజో అబే ప్రధానమంత్రిత్వంలో జపాన్ వ్యూహాత్మక దృక్పథం మరింత మారిపోయింది. చైనా సముద్ర విస్తరణ, దూకుడు వైఖరి జపాన్‌లో తీవ్రమైన ఆందోళన రేపాయి. అమెరికా, భారత్, ఆస్ట్రేలియాతో కలిసి క్వాడ్ కూటమి ఆలోచనను ముందుకు తెచ్చింది జపానే. అంతే కాదు, దూర శ్రేణి క్షిపణులు సమకూర్చుకోవడం, నౌకాదళ వేదికలను విమాన వాహక నౌకలుగా మార్చడంవంటి నిర్ణయాలతో జపాన్ శాంతివాద చట్రంనుండి బయటకు అడుగు వేసింది. జాతీయవాద నేతలు "కాలం చెల్లిన శాంతివాద వ్యాఖ్యానాలు మనను బలహీనపరుస్తున్నాయి" అని వాదించారు.

తాకైచి యుగం: జపాన్ సీఐఏ పుట్టింది

నేడు జపాన్ ప్రధానమంత్రి సానే తాకైచి, అబే రాజకీయ వారసురాలిగా, ఆయన జాతీయవాద భావజాలాన్ని మరింత బలంగా ముందుకు తీసుకువెళుతున్నారు. చైనా ఇప్పటికే ఆమె భద్రతా వ్యాఖ్యలపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇటీవల తాకైచి ప్రభుత్వం ఆమోదించిన బిల్లు జపాన్ నిఘా నిర్మాణంలో 70యేళ్ల తర్వాత అత్యంత మహత్తరమైన సంస్కరణగా చరిత్రకెక్కింది. "నేషనల్ ఇంటెలిజెన్స్ కౌన్సిల్" మరియు "నేషనల్ ఇంటెలిజెన్స్ బ్యూరో" పేర్లతో కేంద్రీకృత, నిలువుగా సమన్వయమైన నిఘా వ్యవస్థ నిర్మించబడుతోంది. దీన్నే జపాన్ సొంత సీఐఏగా వర్ణిస్తున్నారు నిపుణులు. ఈ బిల్లుపై 39.1 శాతం ప్రజలు మద్దతిచ్చారు. 41.9 శాతం తటస్థంగా ఉన్నారు. కేవలం 19 శాతం వ్యతిరేకించారు. ప్రజాభిప్రాయం స్పష్టంగా చెబుతోంది –జపాన్ ప్రజలు ఇకపై రాజ్యాంగ సంకెళ్లకు అంతగా కట్టుబడి లేరని.

చైనా ఆందోళన, గ్లోబల్ టైమ్స్ హెచ్చరిక

చైనా అనధికారిక వక్త గ్లోబల్ టైమ్స్ పత్రిక ఈ పరిణామాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నిఘా బిల్లు జపాన్ నిఘా విధులను కేవలం దేశీయ భద్రత నుంచి విదేశీ సైనిక నిఘాకు మళ్ళిస్తోందని, విదేశాల్లో గూఢచర్యం, చొరబాటు కార్యకలాపాలను అనుమతిస్తోందని గ్లోబల్ టైమ్స్ ఆందోళన వ్యక్తం చేసింది. నిజంగానే బీజింగ్ వ్యూహకర్తలకు ఇది నిద్రపట్టని సమస్య. జపాన్ యొక్క నైఋతి దీవులు తైవాన్‌కు భౌగోళికంగా సమీపంగా ఉన్నాయి. తైవాన్‌పై చైనా ఏదైనా సైనిక చర్య తీసుకోవాలంటే జపాన్ ప్రతిస్పందనను లెక్కలోకి తీసుకోకుండా ముందుకు వెళ్ళడం సాధ్యం కాదు. జపాన్ దూరశ్రేణి సైనిక సామర్థ్యం పెరుగుతున్న కొద్దీ, తైవాన్‌పై చైనా లెక్కలు మరింత సంక్లిష్టమవుతున్నాయి.

అమెరికా వైఖరి మారింది


ఆసక్తికరమైన విషయమేమిటంటే, 1945లో తాము విధించిన నిబంధనలకే అమెరికా ఇప్పుడు సడలింపు ఇస్తోంది. జపాన్ నిఘా వ్యవస్థను బలోపేతం చేయడం, మేలైన సమాచార మార్పిడి సామర్థ్యాలు పెంచడం, ప్రతి నిఘా నిర్మాణాన్ని మెరుగుపరచడంవంటి అంశాల్లో అమెరికా జపాన్‌కు మద్దతిస్తోంది. కారణం.. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో అమెరికా ఒంటరిగా అన్నీ భరించలేదు. ఇరాన్, ఉక్రెయిన్ వంటి వివిధ యుద్ధరంగాలలో అమెరికా ఏకకాలంలో సైనిక బాధ్యతలు మోస్తున్న నేపథ్యంలో, చైనా తైవాన్‌పై దాడికి దిగితే సత్వర సైనిక జోక్యం ఎంత సాధ్యమో అనే సంశయం జపాన్‌లో పెరుగుతోంది. ఈ నేపథ్యంలో జపాన్ సొంత నిరోధక శక్తిని నిర్మించుకోవడం అనివార్యంగా మారింది.

ఆయుధాల పరంపర

ఈ వ్యూహాత్మక మార్పు కేవలం కాగితాలపై జరగడం లేదు. జపాన్ ఇప్పటికే ఎఫ్–35 స్టెల్త్ యుద్ధ విమానాలు, టామ్‌హాక్ క్షిపణులు, పేట్రియాట్ మరియు ఏజిస్ క్షిపణి రక్షణ వ్యవస్థలు, అపాచీ దాడి హెలికాప్టర్లువంటి అత్యాధునిక వేదికలను నిర్వహిస్తోంది. అంతేకాదు, సొంత హైపర్‌సోనిక్ ఆయుధాలు, దూర శ్రేణి క్షిపణులు, విద్యుదయస్కాంత రైల్‌గన్లు అభివృద్ధి చేస్తోంది. బ్రిటన్, ఇటలీతో కలిసి ఆరోతరం యుద్ధ విమాన కార్యక్రమం (జీసీఏపీ) ముందుకు సాగుతోంది. ఇవన్నీ కలిసి చూస్తే జపాన్ కేవలం ఆత్మరక్షణకు సిద్ధమవడం లేదు, ప్రాంతీయ శక్తిగా తిరిగి ఆవిర్భవించడానికి పునాదులు వేస్తోందని స్పష్టమవుతోంది. తాకైచి ఇటీవల "సమగ్ర జాతీయ శక్తి దృక్పథం నుండి భద్రతను పరిశీలించే నిపుణుల సమావేశం"లో మాట్లాడుతూ, మరింత అధిక రక్షణ వ్యయం, బలమైన సైనిక సామర్థ్యాల అవసరాన్ని నొక్కి చెప్పారు.

జపాన్ ఈ పరిణామమే ఆసియాలో ఆందోళన కలిగించే అంశం కూడా. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ సామ్రాజ్యవాద దాడులకు బాధపడిన దేశాలు –చైనా, కొరియా, ఇతర ఆగ్నేయాసియా దేశాలు.. ప్రస్తుత మార్పులను అనుమానంగా చూస్తున్నాయి. ముఖ్యంగా "టోక్కో" అనే రహస్య పోలీసు వ్యవస్థ 1911 నుండి 1945 వరకు నిర్వహించిన నాజీ గెస్టపో, సోవియట్ ఎన్‌కేవీడీలతో పోల్చబడిన జపాన్ నిఘా చరిత్ర దృష్ట్యా, కొత్త నిఘా సంస్థ పుట్టుక పొరుగుదేశాలకు పాత పీడకలలు గుర్తుకు తెస్తోంది. అయితే అంతర్జాతీయ వాస్తవాలు మారిపోయాయి. ఉత్తర కొరియా ఉన్మాద అణు కార్యక్రమం, చైనా దూకుడు విస్తరణవాదం, ప్రపంచవ్యాప్త ఉగ్రవాద పరిశ్రమ –ఇవన్నీ జపాన్‌ను తప్పనిసరిగా మారేలా బలవంతం చేశాయని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. "నిరోధం అప్పుడే పని చేస్తుంది, శత్రువుకు మన సామర్థ్యంపై, మన సంకల్పంపై నమ్మకం కలిగినప్పుడు" అని తాకైచి స్పష్టంగా ప్రకటించారు.

జపాన్ పునరుజ్జీవనం ఆసియా భద్రత సమీకరణాలను మొత్తంగా తలకిందులు చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. చైనాకు తల నొప్పి, అమెరికాకు ఊరట, తైవాన్‌కు పరోక్ష రక్షణ కవచం –ఇవన్నీ జపాన్ మిలటరీకరణ ఫలితాలుగా కనిపిస్తున్నాయి. శాంతిని కోరిన దేశం సురక్షితంగా ఉండాలంటే శక్తిని సమకూర్చుకోవాల్సిన అనివార్య స్థితిలో పడింది. చరిత్ర చక్రం మళ్ళీ తిరిగింది. జపాన్ మేల్కొంది. ఆసియా ఉలిక్కిపడింది!! ■



పెద్దల మాటలు చాదస్తం కాదు. జీవితం కొంచెం ముందుకు సాగాక, వాటి లోతు అర్థమవుతుంది. ఎందుకంటే, వాళ్లు చెప్పే ప్రతి మాటా అనుభవం నుంచి పుట్టిందే. వారు నడిచిన దారిలో పడిన తొట్రుపాట్లే, మనకు హెచ్చరికలు. చద్దిమూట అంటే రాత్రి అన్నం పొద్దున రుచిగా ఉండటం. అలాగే -పెద్దల మాటలు సమయానికి రుచించకున్నా.. కాలం గడిచాక మనసులో మరింత గాఢంగా నాటుకుంటాయి. "తొందరపడకు," "నీతిగా బతుకు," "డబ్బు కంటే మనిషి విలువ ముఖ్యం" -ఇవి కేవలం మాటలు కాదు, వారు జీవితంలో నేర్చుకున్న పాఠాలు. పాటిద్దాం!!


-మహాదేవ

వింతల్లో వింతలు

## దేవుని మెనూకి వెళ్దాం!



డైట్లు చాలా చూశాం. కీటో, వీగన్, పాలియో... కానీ ఇప్పుడు వచ్చింది "బైబిలికల్ డైట్!". అంటే బైబిల్‌లో పేర్కొన్న ఆహారాలే తినాలన్నమాట. టిక్‌టాక్‌లో 5 లక్షలమంది ఫాలోవర్లున్న కైలా బండీ అనే ప్రభావశాలి, "ఆహారం ద్వారా పాపం వచ్చింది, ఆహారంతోనే పోరాడతా!" అంటోంది. యేసు బ్రేక్‌ఫాస్ట్‌లో రొట్టె, చేప తిన్నాడు కాబట్టి కార్బ్స్–ప్రొటీన్ బ్యాలెన్స్ పాటించమంటున్నారు క్రైస్తవ డైటీషియన్లు. లోకల్ ఫుడ్, ప్రేయర్, బైబిల్ వర్సెస్.. అన్నీ కలిపి వడ్డిస్తున్నారు. కోచింగ్ సెషన్లకు నెలకు రూ.60,000! ఆత్మ శుద్ధికి. పాపం, జేబు శుద్ధికి మాత్రం గ్యారంటీ ఇవ్వట్లేదు!



# సింగ్ గీతం.. నా అదృష్టం

లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో తెరకెక్కిన ప్రతిష్టాత్మక చిత్రం 'సింగ్ గీతం' జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. వైజయంతి మూవీస్, స్వప్న సినిమా బ్యానర్లపై స్టార్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ నిర్మించిన చిత్రంలో ఆయాన్, అహల్యా బ్రమ్హా, శాలిని కొండెపుడి కీలక పాత్రలు పోషించారు.

రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన సినిమా టీజర్, పాటలకు ఇప్పటికే ప్రేక్షకుల నుండి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా హీరోయిన్ అహల్యా బ్రమ్హా విలేకరుల సమావేశంలో పాల్గొని చిత్ర విశేషాలను పంచుకుంది.

**సింగీతంతో పని చేయడం ఎలా అనిపించింది?**

ఆయన అద్భుతమైన దర్శకుడు. సెన్స్ ఆఫ్ హ్యూమర్ బాగుంటుంది. ఆయన దర్శకత్వంలో పని చేయడం నా అదృష్టం. ఆయన గత చిత్రాలాగే 'సింగ్ గీతం' కూడా కాలానికి ముందున్న సినిమా. ఇండియన్ సినిమాలో ఇప్పటివరకు ఎవరూ ప్రయత్నించని సరికొత్త కాన్సెప్ట్ ఇది. 94 ఏళ్ల వయసులో కూడా ఇంత మోడ్రన్ ఆలోచనతో సినిమా చేయడం ఆయనకే సాధ్యం.

**ఇందులో మీ పాత్ర ఎలా ఉంటుంది?**

సింగీతం సినిమాల్లో మహిళా పాత్రలు చాలా బలంగా, స్వతంత్రంగా ఉంటాయి. ఇందులో నా పాత్ర కూడా సాధారణ హీరోయిన్‌లా కాకుండా, కొత్తగా, బలమైన వ్యక్తిత్వంతో ఉంటుంది. ఈ చిత్రంలో విలన్ పాత్రను కూడా ఒక అమ్మాయే చేయడం అరుదైన విషయం. చిన్న పిల్లలనుంచి పెద్దల వరకు అందరూ ఎంజాయ్ చేసేలా కథ యూనివర్సల్‌గా కనెక్ట్ అవుతుంది.

**దేవిశ్రీ ప్రసాద్ సంగీతం?**

దేవిశ్రీ ప్రసాద్ జీనియస్ మ్యూజిక్ డైరెక్టర్. ఆయన ఈ చిత్రానికి బ్యూటిఫుల్ సంగీతాన్ని అందించారు. పాటలు చాలా యూనిక్‌గా ఉంటాయి. ఇప్పటికే విడుదలైన 'ఏమైంది ఏమైంది', 'హలో బాసు' సాంగ్స్ ప్రేక్షకులను ఎంతో అలరించాయి.


**నాగ్ అశ్విన్ సపోర్ట్ గురించి?**

నాగ్ అశ్విన్ సింగీతానికి పెద్ద అభిమాని. ఆయన ఈ సినిమా క్రియేటివ్ ప్రాసెస్‌లో కీలక పాత్ర పోషించడమే కాకుండా, ప్రతి నటుడితో మాట్లాడి విలువైన సూచనలు ఇచ్చేవారు. దర్శకత్వం మొత్తం సింగీతం గారిదే అయినప్పటికీ, సినిమా మరింత బాగా రావడానికి అవసరమైన ప్రతిదాన్ని నాగ్ అశ్విన్ దగ్గరుండి చూసుకున్నారు.

**నిర్మాతల గురించి?**

వైజయంతి మూవీస్, స్వప్న సినిమాస్ వంటి ప్రతిష్టాత్మక బ్యానర్లలో పని చేయడం నా అదృష్టం. నిర్మాతలు ప్రియాంక, స్వప్న చాలా ఫ్రెండ్లీగా ఉంటూ.. ఎప్పుడూ కొత్త తరహా కథలను ప్రేక్షకులకు అందించాలని ఆలోచిస్తారు. వారితో కలిసి ఈ సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది.

## ఫో స్టార్!




# ఆ వార్తల్లో నిజం లేదు

అల్లు అర్జున్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో సినిమా రానున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో రైటర్ స్పందించారు. సినిమా బడ్జెట్ కారణంగా ఆగిపోయిందని వార్తలు వచ్చాయి. దీనిపై రైటర్ రత్నకుమార్ పరోక్షంగా స్పందిస్తూ ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని చెప్పారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన 'విక్రమ్' జూన్ 3న నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రత్నకుమార్ పోస్ట్ పెట్టారు. ఆ సినిమా ప్రారంభంలో లోకేశ్ కనగరాజ్ పెట్టిన



పోస్టును షేర్ చేసిన రత్నకుమార్.. ఆ పోస్ట్ చరిత్ర సృష్టించిందని గుర్తుచేశారు. ఆయన సినిమాల్లో తాను కూడా భాగమైనందుకు థాంక్స్ చెప్పారు. అల్లు అర్జున్ సినిమా కోసం వేచి చూడలేకపోతున్నామని పేర్కొన్నారు. దీంతో ఈ ప్రాజెక్ట్ ఆగిపోలేదని క్లారిటీ వచ్చేసింది. ఇక ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ విడుదల చేసిన థీమ్ సాంగ్ రికార్డు క్రియేట్ చేసిన విషయం తెలిసిందే. అది సోషల్ మీడియాలో ట్రెండ్ క్రియేట్ చేసింది. ఏకంగా ఈ థీమ్ సాంగ్‌పై ఇన్స్టాలో 3,55,000కి పైగా రీల్స్ క్రియేట్ అయ్యాయి. అత్యధిక రీల్స్ పొందిన థీమ్ సాంగ్‌గా ఈ పాట రికార్డు నెలకొల్పింది. ఇక అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో 'రాకా'లో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న మూవీలో దీపికా పదుకొణె కథానాయికగా కనిపించనున్నారు. సైన్స్ ఫిక్షన్ జానర్‌లో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దీని తర్వాత లోకేశ్ సినిమా ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఫైనల్ కట్‌లో టాక్సిక్

కన్నడ స్టార్ హీరో యష్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'టాక్సిక్'పై సోషల్ మీడియాలో కొన్ని నెగిటివ్ వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. సినిమా అవుట్‌పుట్ పట్ల యష్ అసంతృప్తిగా ఉన్నాడని, అందుకే భారీ ఖర్చుతో చిత్ర యూనిట్ రీషూట్స్ ప్లాన్ చేస్తోందనే పుకార్ల చక్కర్లు కొడుతున్నాయి. అయితే, ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని చిత్ర బృందం స్పష్టం చేసింది. సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, ఫైనల్ కంటెంట్ సిద్ధంగా ఉందని మేకర్స్ ఈ రూమర్లకు గట్టిగా చెక్ పెట్టారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న సినిమా నాన్-థియేట్రికల్ డీల్స్ క్లోజ్ అయిన వెంటనే సరికొత్త విడుదల తేదీని అధికారికంగా ప్రకటించడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. అంతేకాకుండా, ఈ చిత్రాన్ని ఇంగ్లీష్ భాషలో కూడా ఒకేసారి విడుదల చేస్తుండటంతో, యష్ ప్రస్తుతం ఇంటర్నేషనల్ వేదికలపై సినిమాను భారీగా ప్రమోట్ చేసే పనిలో బిజీగా ఉన్నాడు. అంతా అనుకున్నట్టు జరిగితే ఈ ఏడాది ఆగస్టులోనే 'టాక్సిక్' ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాల సమాచారం. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా కియారా



అద్వానీ, నయనతార, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా మరియు రుక్మిణి వసంత్ వంటి స్టార్ హీరోయిన్లు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ మరియు మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నాయి.

## సినిమా సమీక్ష: స్పోర్ట్స్ డ్రామా

### పెద్ది: గుర్తింపు కోసం పోరాడిన ఓ క్రీడాకారుని కథ. హృదయానికి హత్తుకుంటుంది, కానీ కొన్నిచోట్ల కుదురు తప్పినట్టు అనిపించింది.

**దర్శకత్వం:** బుచ్చిబాబు సానా **తారాగణం:** రామ్‌చరణ్, శివరాజ్‌కుమార్, జాన్వీకపూర్, జగపతిబాబు తదితరులు **సంగీతం:** ఏఆర్ రెహమాన్ **కెమెరా:** ఆర్. రత్నవేలు **నిర్మాణం:** వెంకట సతీశ్ కిలారు, ఇషాన్ సక్సేనా

**3.5/5**


చూడదగిన చిత్రం. కొన్ని లోపాలున్నా స్ఫూర్తిదాయకం

| | |
|---|---|
| కథ, మాటలు | 4/5 |
| దర్శకత్వం | 3.5/5 |
| రామ్‌చరణ్ నటన | 4.5/5 |
| సాంకేతిక విభాగాలు | 4.5/5 |
| ప్రథమార్ధం | 3/5 |
| ద్వితీయార్ధం | 4/5 |

తెలుగు సినిమాలో అగ్ర తారలకు దర్శకులు వేసే పాత్రలు చాలావరకు ఒకే ఒరలో ఇముడుతాయి. ఎలివేషన్లు, మాస్ సన్నివేశాలు, అతిశయోక్తి వీరత్వం. ఆ నిచ్చెనను దిగి, ప్రభుత్వ రికార్డుల్లో పేరే లేని ఒక పల్లె కోసం పోరాడిన ఓ ఆట కూలీ కథ చెప్పే సాహసానికి బుచ్చిబాబు సానా పూనుకున్నాడు. 'పెద్ది' అందుకే విలక్షణమైన ప్రయత్నం. రోటీన్‌కి భిన్నంగా చేసినా.. కమర్షియల్ ఎలిమెంట్స్ ఎక్కడా వదల్లేదు.

**కథేంటంటే?**

విజయనగరం జిల్లాలోని కొండ కింద ఊరు అది. వందలమంది జీవనం సాగిస్తున్నా, ప్రభుత్వ రికార్డుల్లో ఆ ఊరికి గుర్తింపు అన్నదే ఉండదు. అందుకే ఆ ఊరు అన్నా, అక్కడినుంచి వచ్చిన మనుషులన్నా అందరికీ చిన్న చూపు. ఆ ఊళ్లో పుట్టి పెరిగిన వాడే పెద్ది (రామ్‌చరణ్). రోజూ విజయనగరం వెళ్లి కూలి పనులు చేసుకుంటుంటాడు. పేరుకి కూలీ అయినా క్రికెట్లో మాత్రం రాటు దేలిన ఆటగాడు. అందుకే విజయనగరం, బొబ్బిలి క్రికెట్ జట్లు వేలంలో పెద్దిని కొనేందుకు పోటీపడుతుంటాయి. ఆరు బంతులకు ఆరు సిక్సర్లు కొట్టగలిగిన మొనగాడైన పెద్దిని అంతా ఆట కూలీ అని పిలుస్తుంటారు. అలాంటి ఆటగాడు క్రికెట్‌ని వదిలి కుస్తీ క్రీడాకారుడిగా ఎందుకు మారాల్సి వచ్చింది? కొండకింద ఊరు, అక్కడి మనుషుల కోసం పెద్ది చేసిన పోరాటంలో అతను ఏం కోల్పోయాడు? ఏం సాధించాడు? పెద్ది ప్రయాణంపై అప్పలసూరి (జగపతిబాబు), గౌర్నాయుడు (శివరాజ్‌కుమార్) ఎలాంటి ప్రభావం చూపించారు? ఈ కథలో అచ్చియమ్మ (జాన్వీకపూర్) ఎవరు? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.



"ఆ ఊరికీ ఈ ఊరికీ దూరం తగ్గించడం కాదు రా... ఆ మనుషులకీ ఈ మనుషులకీ మధ్య దూరం తగ్గించడం"
చిత్రంలో బలమైన సంభాషణ

| బలాలు | లోపాలు |
|---|---|
| రెహమాన్ స్కోర్ | ఫస్టాఫ్ పేసింగ్ |
| రత్నవేలు కెమెరా | పాత్రల లాజిక్ |
| చరణ్ కష్టం | అవసరానికి మించిన కాస్ట్ |
| సెకండాఫ్ ఎమోషన్ | |

**విమర్శనాత్మక విశ్లేషణ**

**ఏమి పని చేసింది?**

క్రికెట్ నుంచి కుస్తీకి మారే క్రాస్ ఓవర్ అథ్లెట్ నేపథ్యం సినిమాకి వెన్నెముక. ఆ మార్పు ప్రథమార్ధంలో సహజంగా కుదిరింది. అప్పలసూరి పాత్ర చుట్టూ అల్లిన సన్నివేశాలు కథకు భావోద్వేగ పునాదిని వేశాయి. ద్వితీయార్ధంలో కుస్తీ పోరాట ఘట్టాలు, ఆస్పత్రి సన్నివేశాలు -ఆ రెండూ మనసుల్ని హత్తుకుంటాయి. రత్నవేలు కెమెరా పనితనం ప్రతి ఫ్రేమ్‌లో కనిపించింది. రెహమాన్ నేపథ్య సంగీతం కేవలం అనుభూతిని కాదు, దృశ్యానికి కొత్త లేయర్‌ను యాడ్ చేసింది.

రామ్‌చరణ్ విషయంలో చెప్పాలంటే.. ఈ పాత్రకు అనుగుణంగా శారీరకంగా తనను తాను మలుచుకున్న తీరు స్పష్టంగా కనిపిస్తుంది. కమర్షియల్ హీరోగా స్థిరపడిన చరణ్.. ఇలాంటి కథని నమ్మి చేయడానికి సాహసించడం.. రిస్క్‌నే రిస్క్‌లో పెట్టే నిర్ణయమే. చరణ్ రిస్క్ కష్టం వృధాపోలేదు.

**ఏమి పని చేయలేదు?**

ప్రథమార్ధంలో హీరోయిన్ ప్రవేశం, ఆమె చుట్టూ నడిచే రాజకీయ ఎత్తుగడలు.. కథను కొంచెం పక్కకు లాగాయి. ద్వితీయార్ధంలో మరో క్రీడకు మారే సంఘర్షణ, సవాళ్లు చిన్న డైలాగ్‌తో తొందరగా సరిపెట్టేయడం కొంత నిరాశ కలిగించొచ్చు. ఫస్టాఫ్‌లో నిర్మించిన కొన్ని పాత్రలు సెకండాఫ్‌లో అనూహ్యంగా మారిపోవడానికి తగిన లాజిక్ మిస్సయ్యాడు దర్శకుడు. జాన్వీకపూర్, రావురమేశ్, దివ్యేందు.. వీళ్లందరూ అవసరానికి మించిన బలగాలు. పెద్ద ప్రాజెక్టుగా చూపించుకునే కమర్షియల్ స్ట్రాటజీ.

**తుది తీర్పు:** తెలుగు తెరపై అరుదుగా కనిపించే ఈ తరహా స్పోర్ట్స్ ఎమోషనల్ డ్రామాకి 'పెద్ది' కొత్త గుర్తింపు తెచ్చింది. లోపాలు లేవని కాదు కానీ.. అవి సినిమాకున్న స్ఫూర్తిని మాత్రం దెబ్బతీయలేదు.

# ఓటీటీలో ధురంధర్-2

ఇండియన్ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ధురంధర్ 2: ది రివెంజ్' ఓటీటీ ప్రియులను అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో రూ. 1800 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లతో సంచలన విజయం సాధించిన ఈ చిత్రం, గురువారం సాయంత్రం నుంచే డిజిటల్ వేదికపైకి వచ్చింది. భారత్‌లో ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'జియో హాట్‌స్టార్' వేదికగా సినిమా డిజిటల్ ప్రీమియర్ ప్రదర్శితమవుతుంది. అలాగే జూన్ 5నుంచి ఈ చిత్రం రెగ్యులర్ స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానుంది. హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం అందుబాటులో ఉంటుంది. థియేటర్లలో కట్ చేసిన కొన్ని సీన్స్, అన్‌ఫిల్టర్డ్ డైలాగ్స్‌తో కూడిన ప్రత్యేక వెర్షన్ కట్‌ను భారత్‌లో జియో హాట్‌స్టార్ స్ట్రీమింగ్ చేస్తుండటం విశేషం. దీనికి ముందు సాయంత్రం ఒక 30 నిమిషాల బిహైండ్-ది-సీన్స్ ప్రీ-షో కూడా ఉండనుంది. ఇక విదేశాల్లోని సినీ అభిమానుల కోసం ఈ మూవీ ఇప్పటికే నెట్‌ఫ్లిక్స్ వేదికగా అందుబాటులోకి వచ్చింది. ఆదిత్య ధార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ హై-వోల్టేజ్ స్పై థ్రిల్లర్‌లో రణ్‌వీర్ సింగ్, సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్ వంటి భారీ తారాగణం నటించారు.

